SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 19 | సంచిక: 287 | ఎడిటర్ : అలీ ముర్తుజా | ఆదివారం 6 సెప్టెంబర్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల:రూ.5 |



# రెండేళ్లలో టీచర్ల సమస్యలన్నీ పరిష్కరిస్తా

### విద్యారంగ రూపురేఖలు మార్చేస్తా

- ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది
- అనేక సంస్కరణలు, మార్పులు తేస్తున్నాం
- పెండింగ్ టీచర్ల పదోన్నతులు పూర్తి చేశామన్న రేవంత్
- బదిలీలపై జాగ్రత్తగా వ్యవహరిస్తున్నామన్న సీఎం
- రెండేళ్లలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ
- సాంకేతిక విద్యకు ప్రభుత్వ సహకారం ఉంటుందన్న రేవంత్
- పాలిటెక్నిక్ విధానంలో మార్పులు లేవని స్పష్టీకరణ
- కోడంగల్ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

2

## 264 ఎకరాల్లో భారీ ప్రాజెక్ట్

- దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్
- హైదరాబాద్‌లో టీసీఎస్ రూ.70వేల కోట్ల పెట్టుబడి
- గ్రీన్ ఎనర్జీ, వాటర్-న్యూట్రల్ డిజైన్‌తో క్యాంపస్
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కీలక సమావేశం
- దేశానికే ఇది చారిత్రాత్మక ప్రాజెక్టు: సిఎం రేవంత్

2





# కేసీఆర్ ఎందుకు రాజీనామా చేయాలి?

- వెయ్యి రోజుల మోసానికి రేవంతే తప్పుకోవాలి: కేటీఆర్
- 420 హామీలకు 420 సార్లు రాజీనామా చేయాలని ఎద్దేవా
- నిరుద్యోగులను నిండా ముంచారని కాంగ్రెస్‌పై ధ్వజం
- అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరిక
- కరీంనగర్ యువ సమరభేరిలో తీవ్ర విమర్శలు

**కరీంనగర్, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్):** "తెలంగాణ సాధించిన కేసీఆర్ ఎందుకు రాజీనామా చేయాలి? వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి వెయ్యి రోజులుగా ప్రజలను మోసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే రాజీనామా చేయాలి" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలకు ఆ పార్టీ నాయకులు 420 సార్లు రాజీనామా చేయాలని ఎద్దేవా చేశారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ చేపట్టిన పోరుబాట కార్యక్రమంలో భాగంగా కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన

మిగతా 3 లో

# సీట్లు పెరిగితే 117 గెలుస్తాం

'ఈ నెలఖరుకు వస్తా, సిరిసిల్లపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తా, వచ్చే నెలలో సిద్దిపేటకు వస్తా, కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా?, సీట్లు పెరిగితే 117 సీట్లు గెలుస్తాం, ఇప్పుడున్న సీట్లే ఉంటే 90 సీట్లు గెలుస్తాం' అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాపాలన పోవాలి పాపాల భైరవుడు రావాలి అని వాళ్లు కోరుకుంటున్నారని, తమ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు.

- ఇప్పుడున్నవే అయితే 90 గెలుస్తాం
- కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా?
- సిరిసిల్లపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తా
- సిద్దిపేటలోనూ కాంగ్రెస్ దే గెలుపు
- వెయ్యి రోజుల్లో కేసీఆర్‌కు రూ.22 కోట్లు ఖర్చు
- ప్రభుత్వ సొమ్ము తీసుకొని అసెంబ్లీకి రావట్లేదు
- ప్రజా సమస్యలు కేసీఆర్ ప్రస్తావించరా?
- ఏడాదిలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం
- కిరేకల్ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి
- వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి ప్రారంభం

2

# భారీగా పెరగనున్న ఆటో చార్జీలు!



- బేసిక్ చార్జీగా రూ.30 నిర్ణయం
- ప్రభుత్వం ఆమోదమే తరువాయి..

2

తెలంగాణలో ఆటో చార్జీల పెంపునకు సంబంధించి రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి నేతృత్వంలోని అధికారుల కమిటీ తయారుచేసిన ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వ పరిశీలనకు చేరాయి. ప్రభుత్వం ఈ సిఫార్సులకు లాంఛనంగా ఆమోదం తెలిపిన వెంటనే కొత్త చార్జీల అమలుపై అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి.



# దొరకని ఆయుధాలు.. దొంగల జాడేదీ?

- నాలుగు రోజులైనా చిక్కని కీలక ఆధారాలు
- రంగంలోకి దిగిన జాతీయ దర్యాప్తు సంస్థ
- జవాన్లు, మాజీ సిబ్బందిపై విస్తృత విచారణ
- రాత్రి పనిచేయనిదకెమెరాలపై అనుమానాలు
- ఆయుధాల లెక్కల్లో వ్యత్యాసాలపైనా ఆరా

2

# '22ఏ' పేరుతో భూదందా!

- ప్రజల భూములు లాక్కునే కుట్ర: రాంచందర్‌రావు
- కేసీఆర్ బాటలోనే రేవంత్ సర్కార్
- బాధిత భూములపై వెంటనే సమీక్షకు డిమాండ్
- న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని స్పష్టం

3



# రేపటి నుంచి అసెంబ్లీ

- ఉభయ సభల సమావేశాలకు సర్వం సిద్ధం
- ప్రశాంత వాతావరణం ఉండేలా పటిష్ఠ చర్యలు
- సభ్యుల ప్రశ్నలకు ముందుగానే సమాధానాలు
- మూడు భాషల్లో సభా సమాచారానికి ఆదేశం
- కీలక బిల్లులు.. ప్రజా సమస్యలపై వాడీవేడి చర్చలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 6 (సమయం న్యూస్):** అసెంబ్లీ, శాసనమండలి వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. సభ లోపల, బయట ప్రశాంత వాతావరణం ఉండేలా పటిష్ఠ చర్యలు చేపట్టాలని శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సభ్యులు కోరిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా

మిగతా 3 లో



# శతాబ్దం దాటినా..
## విద్యా ప్రతిభలో ప్రత్యేక ముద్ర

- శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ శతాబ్ది వేడుకల్లో మోదీ
- తరతరాల నాయకులను తీర్చిదిద్దిందంటూ ప్రశంస
- జెన్-జీ విద్యార్థులతో ముఖాముఖి
- మెట్రోలో కళాశాలకు చేరుకున్న మోదీ

4

# పోలీసులకే సవాల్..

- సీజేపీ నిరసనల ఘటనలో ఇన్ఫ్లుయెన్సర్ అరెస్ట్
- దాడి చేశానంటూ ఇంటర్వ్యూలో వ్యాఖ్యలు
- బాధితుడి కుమార్తె ఫిర్యాదుతో పోలీసుల చర్య
- ఆత్మరక్షణ కోసమే దాడి చేశానన్న భరద్వాజ్
- కోర్టు అనుమతితో ఒక రోజు పోలీసు కస్టడీ



.. వివరాలు 4లో

# బస్తర్ మావోయిస్టుల దాడి కేసు

- 10 మందికి శిక్ష ఖరారు
- జగదల్‌పూర్ ప్రత్యేక కోర్టు తీర్పు
- సెప్టెంబర్ 16న శిక్షల ప్రకటన

4




# లష్కర్ కమాండర్ హతం

- భద్రతా దళాల మెరుపు దాడి
- బద్గాంలో సంయుక్త ఆపరేషన్



4

జమ్మూ కశ్మీర్‌లోని బద్గాం జిల్లా యూస్‌మార్గ్ పర్వత ప్రాంతంలో శనివారం ఉదయం భద్రతా దళాలు జరిపిన మెరుపు ఎన్‌కౌంటర్‌లో లష్కరే తొయిబాకు చెందిన కీలక పాకిస్థానీ కమాండర్ 'యాసిర్' హతమయ్యాడు.

# రెండేళ్లలో టీచర్ల సమస్యలన్నీ పరిష్కరిస్తా

- విద్యారంగ రూపురేఖలనుమార్చేస్తా
- ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది
- అనేక సంస్కరణలు, మార్పులు తేస్తున్నాం
- పెండింగ్ టీచర్ల పదోన్నతులు పూర్తి చేశాం
- బదిలీలపై జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాం
- సాంకేతిక విద్యకు ప్రభుత్వ సహకారం ఉంటుందన్న రేవంత్
- పాలిటెక్నిక్ విధానంలో మార్పులు లేదు
- కోడంగల్ పర్యటనలో రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్):** రాష్ట్రంలో విద్యారంగ రూపురేఖలను మార్చేందుకు ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, విద్యాశాఖలో అనేక సంస్కరణలు, మార్పులు తీసుకువస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూర్తి కట్టుబడి ఉందని, తనకు రెండేళ్ల సమయం ఇస్తే అన్ని సమ స్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తల్లిదండ్రులతో సమానంగా సమాజంలో పిల్లల బంగారు భవిష్యత్తుకు బలమైన పునాది వేసేది ఉపాధ్యాయులేనని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. గత పాలకుల హయాంలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో పడివున్న ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియను తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చిత్తశుద్ధితో పూర్తి చేసిందని గుర్తుచేశారు. టీచర్ల బదిలీల విషయంలోనూ ఎక్కడా ఎలాంటి లోపాలు, అభ్యంతరాలకు తావులేకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని సీఎం తెలిపారు. "రాష్ట్రంలో కొత్తగా 88 మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరారు. నేను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుని ఈ స్థాయికి చేరుకున్నాను. అందుకే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి నా బాధ్యత. సాంకేతిక విద్యను పేద విద్యార్థులకు మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం అన్నివిధాలుగా సహకారం అందిస్తుంది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విద్యాశాఖ కమిషన్ ద్వారా దశాబ్దాలుగా పేరుకుపోయిన ఎన్నో సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన పీఆర్సీ సమస్యను కూడా పరిష్కరించాం" అని ముఖ్యమంత్రి వివరించారు. ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వానికి ఎంతో గౌరవం ఉందని చెబుతూ సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. "ఇటీవల హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించడం నన్ను ఎంతో బాధించింది. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పుడు రోడ్డెక్కడం తగదు. చర్చల ద్వారానే పరిష్కారం దొరుకుతుంది" అని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫొటో ఎగ్జిబిషన్‌ను ముఖ్యమంత్రి సందర్శించారు. గత జ్ఞాపకాలు, విద్యా ప్రగతిని ప్రతిబింబించే చిత్రాలను ఆసక్తిగా పరిశీలించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులతో ఆత్మీయంగా ముచ్చటించి, వారితో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలుపుతూ బోధనారంగంలో మరింత అంకితభావంతో పని చేయాలని పిలుపునిచ్చారు. పాలిటెక్నిక్ విద్యా విధానంలో ఎలాంటి మార్పులు చేయట్లేదని ఈ సందర్భంగా సీఎం పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విషయంలో జరుగుతున్న అవాస్తవ ప్రచారాన్ని నమ్మొద్దని సూచించారు. ఉపాధ్యాయులను అడ్డుపెట్టుకుని ప్రభుత్వాన్ని బ్లాక్ మెయిల్ చేయాలని చూస్తున్నారన్న రేవంత్? రెడ్డి, అలాంటి వారి ట్రాప్?లో పడొద్దని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు మనమంతా పునరంకితమవుదామని పిలుపునిచ్చిన ముఖ్యమంత్రి, ఉపాధ్యాయుల బాధ్యత తాను చూసుకుంటానని, విద్యార్థుల బాధ్యత టీచర్లు చూసుకోవాలని సూచించారు. అంతకుముందు కొడంగల్ నివాసంలో కార్యకర్తలు, స్థానిక నాయకులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వం సర్ పేరుతో ఓట్లను తొలగించే కుట్ర చేస్తోందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలను లక్ష్యంగా చేసుకున్నారని అన్నారు. తెలంగాణలో ఓట్లను తొలగించి దొంగ దెబ్బ తీయాలనుకుంటే కాంగ్రెస్ కార్యకర్తలు ఊరుకోరని హెచ్చరించారు. కాంగ్రెస్ అనుకూల ఓట్లను తొలగించాలని చూస్తున్నారన్న ముఖ్యమంత్రి, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లను బీజేపీ టార్గెట్ చేసిందన్నారు. గతంలో ఎన్నికల్లో ఓడించేందుకు ఈడీ, సీబీఐ ఉపయోగించేవారన్నారు. కాంగ్రెస్‌ను ఓడించే కుట్రకు బీఆర్ఎస్ కూడా బీజేపీకి మద్దతు ఇస్తోందన్న రేవంత్ రెడ్డి, అందరూ అప్రమత్తంగా ఉండి వారి కుట్రలను తిప్పికొట్టాలని స్పష్టం చేశారు.



# భారీగా పెరగనున్న ఆటో చార్జీలు

## బేసిక్ చార్జీ రూ. 30కి పెంపునకు సిఫార్సు

## ప్రభుత్వ ఆమోదమే తరువాయి

**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్):** తెలంగాణలో ఆటో చార్జీల పెంపునకు సంబంధించి రవాణా శాఖ కమిషనర్ డాక్టర్ కె. ఇలంబర్తి నేతృత్వంలోని అధికారుల కమిటీ తయారుచేసిన ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వ పరిశీలనకు చేరాయి. ప్రభుత్వం ఈ సిఫార్సులకు లాంఛనంగా ఆమోదం తెలిపిన వెంటనే కొత్త చార్జీల అమలుపై అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి. కమిటీ సమర్పించిన నివేదిక ప్రకారం, ఆటోలకు కనీస చార్జీగా తొలి 1.6 కిలోమీటర్ల దూరానికి రూ. 30, ఆ తర్వాతి ప్రతి కిలోమీటరుకు రూ. 14 చొప్పున వసూలు చేయాలని ప్రతిపాదించారు. అలాగే, ట్రాఫిక్ లేదా ప్రయాణికుల కోసం వెయిటింగ్ సమయానికి నిమిషానికి 75 పైసలు, రాత్రి వేళల్లో (నైట్ చార్జీలు) సాధారణ చార్జీ కంటే 50 శాతం అదనంగా అమలు చేయాలని సిఫార్సు చేశారు. తెలంగాణ ఆటో, క్యాబ్ జేఏసీ యూనియన్లు తమ 14 ప్రధాన డిమాండ్లపై నిర్వహించిన నిరసనల అనంతరం, ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకే ఈ అధ్యయనం చేపట్టారు. డీటీసీ సురేశ్ రెడ్డి, ఎంవీఐ శ్రీనివాస్ బృందం ఢిల్లీ, బెంగళూరు, ముంబయి, కేరళలోని చార్జీలను పరిశీలించి ఈ నివేదిక ఇచ్చింది. రాష్ట్రంలో గత 12 ఏళ్లుగా ఆటో చార్జీలను సవరించలేదని, ఈ కాలంలో ఇంధన ధరలతో పాటు ఇన్సూరెన్స్, విడిభాగాలు, నిర్వహణ ఖర్చులు భారీగా పెరిగాయని తెలిపింది. ఆటో కొనుగోలు వ్యయం, రుణాలు, డ్రైవర్ల జీతాలు, ప్రతి కిలోమీటరుకు రూ. 13.53 అయ్యే నిర్వహణ వ్యయాన్ని ప్రామాణికంగా తీసుకుని ప్రతి కిలోమీటరుకు రూ. 14గా నిర్ణయించాలని సూచించింది. మంత్రివర్గ ఆమోదం ముద్ర పడగానే రాజధాని హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా కొత్త మీటర్ చార్జీలు అమల్లోకి రానున్నాయి.

# దొరకని ఆయుధాలు.. దొంగల జాడేదీ?

## నాలుగు రోజులైనా చిక్కని కీలక ఆధారాలు

## రాత్రివేళ పనిచేయని సీసీ కెమెరాలపై అనుమానాలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్):** అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే ఆర్మీ రెజిమెంట్ ఆయుధాగారం నుంచి అధునాతన ఆయుధాలు మాయమైన ఘటనలో నాలుగు రోజులు గడిచినా మిస్టరీ వీడటం లేదు. ఆయుధాలను ఎవరు అపహరించారు? ఎక్కడికి తరలించారు? అన్న కీలక ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం లభించలేదు. జాతీయ భద్రతతో ముడిపడిన వ్యవహారం కావడంతో కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు కేసు దర్యాప్తును జాతీయ దర్యాప్తు సంస్థకు అప్పగించినట్లు సమాచారం. దీంతో ఎన్ఐఏ అధికారులు రంగంలోకి దిగి దర్యాప్తును ముమ్మరం చేశారు. స్థానిక పోలీసులతో పాటు మిలిటరీ ఇంటెలిజెన్స్, ఇతర ప్రత్యేక విభాగాల అధికారులు ఇప్పటికే విస్తృతంగా విచారణ చేపట్టారు. రెజిమెంట్‌లో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న జవాన్లతో పాటు గతంలో అక్కడ పనిచేసి బదిలీపై వెళ్లిన సిబ్బందినీ ప్రత్యేక బృందాలు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. అనుమానితుల ఫోన్ కాల్ సమాచారం, కదలికలను విశ్లేషించినప్పటికీ నిందితులను గుర్తించే కీలక ఆధారాలు ఇప్పటివరకు లభించలేదని సమాచారం. దర్యాప్తులో వెలుగుచూస్తున్న భద్రతా లోపాలు అధికారులను కలవరపెడుతున్నాయి. ఆయుధాలు నిల్వ చేసే అత్యంత కీలకమైన 'కోట' ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కొంతకాలంగా ప్రతిరోజూ రాత్రి 10.30 గంటల తర్వాత పనిచేయడం లేదని విచారణలో గుర్తించినట్లు సమాచారం. తిరిగి ఉదయం 7 గంటల సమయంలోనే అవి పనిచేస్తున్నట్లు తేలిందని తెలుస్తోంది. సీసీ కెమెరాల నిలిపివేతకు సంబంధించి ఎలాంటి రాతపూర్వక ఆదేశాలు లేవన్న అంశంపైనా అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం. రాత్రివేళల్లోనే భద్రతా నిఘా అత్యంత కీలకంగా ఉండగా.. అదే సమయంలో కెమెరాలు పనిచేయకపోవడం వెనుక సాంకేతిక సమస్య ఉందా? ఉద్దేశపూర్వకంగా నిలిపివేశారా? లోపలి వ్యక్తుల ప్రమేయం ఉందా? అనే కోణాల్లో దర్యాప్తు సాగుతోంది. ఆయుధాగారం నిర్వహణకు సంబంధించిన రికార్డులపైనా దర్యాప్తు బృందాలు దృష్టి పెట్టాయి. ఘటనకు సుమారు 15 రోజుల ముందు నుంచే ఆయుధాలు, మందుగుండు సామగ్రికి సంబంధించిన రిజిస్టర్లలో లెక్కల వ్యత్యాసాలు ఉన్నట్లు అంతర్గత పరిశీలనలో గుర్తించినట్లు సమాచారం. రోజువారీ లెక్కల నమోదులో తేడాలు, సీసీ కెమెరాల పనితీరు మధ్య ఏదైనా సంబంధం ఉందా అన్న కోణంలోనూ సాంకేతిక ఆధారాలను సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం భద్రతా వర్గాలను కలవరపెడుతున్న ప్రధాన అంశం చోరీకి గురైన ఆయుధాల ఆచూకీ. అవి ఎక్కడికి చేరాయి? ఎవరి చేతుల్లో ఉన్నాయి? చోరీ వెనుక ఉద్దేశం ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానాలు రాబట్టడమే దర్యాప్తులో కీలకంగా మారింది. అధునాతన ఆయుధాలు నేరగాళ్లు లేదా ఉగ్రవాదుల చేతుల్లోకి చేరితే తీవ్ర భద్రతా ముప్పు ఏర్పడే అవకాశం ఉండటంతో వీలైనంత త్వరగా వాటిని గుర్తించి స్వాధీనం చేసుకోవడంపై దర్యాప్తు సంస్థలు దృష్టి సారించాయి. ఆయుధాల చోరీ వెనుక బయటి వ్యక్తుల హస్తం ఉందా.. లేక 'ఇంటి దొంగల' పాత్ర ఉందా అన్నదే ఇప్పుడు దర్యాప్తులో కీలకంగా మారింది.



# 264 ఎకరాల్లో భారీ ప్రాజెక్ట్...

## దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్

## హైదరాబాద్‌లో టీసీఎస్ రూ.70వేల కోట్ల పెట్టుబడి

## గ్రీన్ ఎనర్జీ, వాటర్-న్యూట్రల్ డిజైన్‌తో క్యాంపస్

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కీలక సమావేశం

## దేశానికే ఇది చారిత్రాత్మక ప్రాజెక్టు: సిఎం రేవంత్

**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్):** హైదరాబాద్‌లో భారీ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు టీసీఎస్ అనుబంధ సంస్థ హైపర్‌వాల్ట్ ఏకంగా రూ. 70,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్ట్‌తో వేలాది మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉండటంతో పాటు, హైదరాబాద్‌కు గ్లోబల్ ఏఐ రంగంలో మరింత కీలక స్థానం దక్కనుంది. పీటీఐ కథనం ప్రకారం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) అనుబంధ సంస్థ హైపర్‌వాల్ట్ హైదరాబాద్‌లో 264 ఎకరాల భూమిని దక్కించుకున్నట్లు శనివారం ప్రకటించింది. ఇక్కడ భారీ స్థాయిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) డేటా సెంటర్ క్యాంపస్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్ట్ కోసం హైపర్‌వాల్ట్, దాని భాగస్వాములు కలిసి రూ. 70,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నారు. ఈ డేటా సెంటర్ సామర్థ్యం గరిష్ఠంగా 1 గిగావాట్ (జీడబ్ల్యూ) వరకు ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ కంపెనీలు, హైపర్‌స్కేలర్లు ఉపయోగించుకునేలా దీన్ని ప్రత్యేకంగా రూపొందించనున్నారు. అధిక సామర్థ్యం ఉన్న కంప్యూటింగ్ సిస్టమ్స్‌ను నిర్వహించేందుకు లిక్విడ్-కూల్డ్ టెక్నాలజీతో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ఈ ప్రాజెక్ట్ వల్ల హైదరాబాద్ ప్రాంతంలో నేరుగా, పరోక్షంగా వేలాది ఉద్యోగాలు వస్తాయని హైపర్‌వాల్ట్ తెలిపింది. ఈ మౌలిక సదుపాయాలను నిర్మించి నిర్వహించేందుకు హైపర్‌వాల్ట్, దాని భాగస్వాములు కలిసి రూ. 70,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నారు. కస్టమర్ల అవసరాలు, టెక్నాలజీలో వచ్చే మార్పులను బట్టి ఈ ప్రాజెక్ట్‌ను దశలవారీగా చేపట్టనున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్ట్‌ను రాష్ట్రానికి, దేశానికి "చారిత్రాత్మకమైనది"గా అభివర్ణించారు. ఏఐ విప్లవంలో హైదరాబాద్ ఇప్పుడు ప్రపంచ స్థాయిలో ముందంజలో ఉందని ఆయన అన్నారు. ముఖ్యంగా ఏఐకి అవసరమైన మౌలిక సదుపాయాలపై హైదరాబాద్ దృష్టి పెడుతోందని చెప్పారు. "ఈ దశాబ్దం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ది. ఏఐ మోడల్స్, వాటిని నడిపించే కంప్యూటింగ్ సామర్థ్యం వేగంగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలుగా మారుతున్నాయి. ఈ కంప్యూటింగ్ సదుపాయం తెలంగాణలో ఉండటం మనకు ఒక అదనపు ప్రయోజనం" అని రేవంత్ రెడ్డి అన్నారు. డేటా సెంటర్ క్యాంపస్ నిర్మాణంలో గ్రీన్ ఎనర్జీని ఉపయోగించడంతో పాటు, నీటి వినియోగాన్ని సమతుల్యం చేసే డిజైన్ విధానాలను పాటించనున్నట్లు కంపెనీ తెలిపింది. టీసీఎస్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ కె. కృతివాసన్ మాట్లాడుతూ, ఈ ప్రాజెక్ట్ తమ "ఇన్‌ఫ్రాస్ట్రక్చర్-టు-ఇంటెలిజెన్స్" వ్యూహాన్ని మరింత ముందుకు తీసుకెళ్తుందని చెప్పారు. ఏఐకి సిద్ధంగా ఉండే మౌలిక సదుపాయాలను టీసీఎస్ క్లౌడ్, ఏఐ, ఎంటర్‌ప్రైజ్ సామర్థ్యాలతో కలిపి ఈ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. "ప్రపంచవ్యాప్తంగా ఉన్న కస్టమర్ల అవసరాలను తీర్చేందుకు హైదరాబాద్‌కు అవసరమైన స్థాయి, ప్రతిభ, టెక్నాలజీ ఎకోసిస్టమ్ ఉన్నాయి" అని కృతివాసన్ అన్నారు. ఈ భారీ పెట్టుబడి ద్వారా ఏఐ, డేటా సెంటర్ల రంగంతోపాటు విద్యుత్, కూలింగ్, నెట్‌వర్కింగ్, నిర్మాణం, ఇంజినీరింగ్, ఆపరేషన్స్ వంటి అనుబంధ రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. పర్యావరణానికి అనుకూలంగా గ్రీన్ ఎనర్జీ, వాటర్-న్యూట్రల్ డిజైన్‌తో ఈ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన చర్చలకు 2026 జనవరిలో దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టాటా సన్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ మధ్య జరిగిన సమావేశం నాంది పలికింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం, టీసీఎస్ ప్రతినిధులతో పలుమార్లు చర్చలు జరిపి కొద్ది నెలల్లోనే ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకొచ్చాయి. దేశంలోని మరో ఐదు రాష్ట్రాల నుంచి పోటీ ఉన్నప్పటికీ తెలంగాణ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును సాధించింది. ఈ ప్రాజెక్టుతో హైదరాబాద్‌ను గ్లోబల్ ఏఐ, డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం మరింత చేరువైంది. ఈ కీలక సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ బి. అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎండీ కె. శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణాదిత్య, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ నిఖిల్ చక్రవర్తి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సీట్లు పెరిగితే 117 గెలుస్తాం

## ఇప్పుడున్నవే అయితే 90 గెలుస్తాం

## కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా?

## సిరిసిల్లపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తా

## సిద్దిపేటలోనూ కాంగ్రెస్ దే గెలుపు

## వెయ్యి రోజుల్లో కేసీఆర్‌కు రూ.22 కోట్లు ఖర్చు

## ప్రభుత్వ సొమ్ము తీసుకొని అసెంబ్లీకి రావట్లేదు

## ప్రజా సమస్యలు కేసీఆర్ ప్రస్తావించరా?

## ఏడాదిలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం

## కిరేకల్ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి

## వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి ప్రారంభం



**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్):** ఏ విషయంపైనైనా చర్చించేందుకు తాను సిద్ధమన్న సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీకి రావాలని బీఆర్?ఎస్ అధినేత కేసీఆర్?కు సవాల్ విసిరారు. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిని ప్రారంభించిన అనంతరం, స్థానిక రాజీవ్‌గాంధీ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఏడాదిపాటు రాకపోతే తొలగిస్తామని, వెయ్యి రోజుల్లో కేసీఆర్‌కు రూ. 22 కోట్లు ఖర్చయ్యిందని, ప్రభుత్వ సొమ్ము తీసుకొని అసెంబ్లీకి రావట్లేదని అన్నారు. ప్రజల సొమ్ము తిని ప్రజా సమస్యలు ప్రస్తావించరా? అని నిలదీశారు. బీఆర్ఎస్ అనే మొక్కను తెలంగాణలో మొలకెత్తనివ్వమని, సిరిసిల్ల, సిద్దిపేటలోనూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఈ నెలఖరుకు వస్తా, సిరిసిల్లపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తా, వచ్చే నెలలో సిద్దిపేటకు వస్తా, కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా?, సీట్లు పెరిగితే 117 సీట్లు గెలుస్తాం, ఇప్పుడున్న సీట్లే ఉంటే 90 సీట్లు గెలుస్తాం' అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాపాలన పోవాలి పాపాల భైరవుడు రావాలి అని వాళ్లు కోరుకుంటున్నారని, తమ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. మీ జిల్లాకు ఒకేసారి మూడు ఎమ్మెల్సీ పదవులను ఇచ్చామని, కేసీఆర్ సీఎం అయితే వాళ్ల కుటుంబసభ్యులకు పదవులు ఇచ్చారని, తమ ప్రభుత్వంలో ఉద్యమకారుల పిల్లలకు పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. అందరిలాగానే బీఆర్ఎస్ కార్యకర్తలకూ రేషన్‌కార్డులు, సన్నబియ్యం ఇస్తున్నామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తల ఇళ్లలో ఉచిత కరెంట్ వస్తోందంటే మా ప్రభుత్వం కృషి కాదా అని సీఎం ప్రశ్నించారు. మేం ఇచ్చిన రైతుభరోసా నిధులను ఎవరైనా బీఆర్ఎస్ కార్యకర్తలు వద్దన్నారా అని అడిగారు. సంపాదన పోయిందని బావ, బామ్మర్ది ఏడుస్తున్నారని ఎద్దేవా చేశారు. నాకు చదువు లేదని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. చదువు లేకపోయినా నాకు సంస్కారం ఉంది. నాకు సంస్కారం ఉంది కాబట్టే మీరు రోడ్లపై తిరుగుతున్నారు. నాకు సంస్కారం ఉంది కాబట్టే కొండా సురేఖ, సీతక్కతో రాఖీ కట్టించుకున్నా. ఎక్కడ ఆస్తి ఇవ్వాల్సి వస్తుందోనని మీరు చెల్లిని బయటకు గెంటేశారు. చెల్లిని బయటకు గెంటేసిన వ్యక్తి ఆడబిడ్డల గురించి ఆలోచిస్తారా?. నాలుగు ఇంగ్లీష్ ముక్కలు వస్తే సరిపోదు. ఆడబిడ్డను చూసుకోవాలి. నీ సంస్కారం ఏంటో నా సంస్కారం ఏంటో అసెంబ్లీకి రా చూసుకుందాం. నేను మంచిగా ఉంటే మీరు ఏదో అనుకుంటున్నారు. బందిపోట్లలా తెలంగాణను దోచుకున్నారు. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుందన్న రేవంత్ రెడ్డి నకిరేకల్ గడ్డా కాంగ్రెస్ అడ్డా అని వేముల వీరేశం నిరూపించారని తెలిపారు. నకిరేకల్ నియోజకవర్గ అభివృద్ధికి అండగా ఉండాలని వీరేశం కోరారని అన్నారు. గత ప్రభుత్వం అమలుచేసిన ఏ పథకాన్ని అయినా రద్దు చేశామా అని అడిగారు. మీరు ఇచ్చిన పథకాలను మరింత మెరుగ్గా ఇస్తున్నామని, బీఆర్ఎస్ ప్రభుత్వం వల్ల రైతులు అనేక రకాలుగా మోసపోయారని, చివరి విడత రైతుభరోసా నిధులు వేయకుండానే గద్దె దిగిపోయారని పేర్కొన్నారు. మీరు ఎగవేసిన రైతుభరోసా రూ. 36 వేల కోట్లను రైతుల ఖాతాల్లో వేశామని, రాష్ట్రాన్ని అన్ని రకాలుగా ముంచి గద్దె దిగిపోయారని, వడ్ల కొనుగోలు, రైతుభరోసా, వడ్లకు బోనస్, ఉచిత కరెంట్ ఇస్తున్నామని వెల్లడించారు. మీకు ధైర్యం ఉంటే అసెంబ్లీకి రండి. అన్నీ చర్చిద్దాం. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం రూ. 11 వేల కోట్లు ఇచ్చాం. ఇవాళ కోటి మంది మహిళలు బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు ఇవ్వడం చూసి కొందరు తట్టుకోలేకపోతున్నారు. మహిళలకు ఉచిత బస్సు రద్దు చేయాలంటూ ఆటో డ్రైవర్లను రెచ్చగొడుతున్నారు. సమస్యలు ఏంటో చెప్పాలని ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్నారు. వీలైన ప్రతిచోటా మహిళలను ప్రోత్సహిస్తున్నాం. కేసీఆర్ ఎప్పుడైనా మహిళల బాగు గురించి ఆలోచించారా?. మహిళలకు పెట్రోల్ బంకులు, సోలార్ నిర్వహణ అప్పగించాం. నిరుద్యోగ యువత ఉసురు పోసుకుని ఇవాళ ఫామ్‌హౌస్‌కే పరిమితం అయ్యారు. పిల్లి శాపాలకు ఉట్లు తెగవని కేసీఆర్ గుర్తుపెట్టుకోవాలి. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో రూ. 32 కోట్లతో నిర్మించిన 100 పడకల ఆస్పత్రిని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి ఆస్పత్రి మొత్తం తిరిగి పరిశీలించారు. ఆస్పత్రిలో అందించబోయే సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. నకిరేకల్‌లో పలు అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. రూ. 345 కోట్లతో 12 రకాల అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, సమీకృత మండల కార్యాలయాల సముదాయ నిర్మాణాలకు సీఎం శంకుస్థాపన చేశారు.

# కేసీఆర్ ఎందుకు రాజీనామా చేయాలి?

మొదటి పేజీ తరువాయి

'యువ సమరభేరి'లో కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యంగా ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి, యూత్ కమిషన్, ఫీజు రీయింబర్స్‌మెంట్, యువతకు రుణాలు తదితర అంశాలను ప్రస్తావిస్తూ ప్రశ్నల వర్షం కురిపించారు. కేసీఆర్ రాజీనామా చేయాలన్న కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలను కేటీఆర్ తప్పుబట్టారు. "2006లో కూడా ఇదే కరీంనగర్‌లో కాంగ్రెస్ నాయకులు కేసీఆర్‌ను రాజీనామా చేయాలని సవాల్ చేశారు. కేసీఆర్ రాజీనామా చేసి ప్రజల్లోకి వెళ్తే ఏం జరిగిందో గుర్తు చేసుకోవాలి. అప్పుడు కాంగ్రెస్‌కు ప్రజలు గట్టి సమాధానం చెప్పారు" అని పేర్కొన్నారు. కేసీఆర్‌తో రాజకీయంగా తలపడితే రేవంత్‌రెడ్డికి అదే పరిస్థితి ఎదురవుతుందని హెచ్చరించారు. "ఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వాన్నే ప్రజలు బర్తరఫ్ చేసే రోజులు దగ్గర్లో ఉన్నాయి" అని వ్యాఖ్యానించారు. పోరాటాలకు పురిటిగడ్డ కరీంనగర్ అని, ఇక్కడి నుంచే కేసీఆర్ తెలంగాణ ఉద్యమానికి కీలక మలుపు ఇచ్చారని గుర్తుచేశారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ విస్మరించిందని కేటీఆర్ ఆరోపించారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పారని, అవి ఏమయ్యాయని ప్రశ్నించారు. యూత్ కమిషన్, ప్రైవేటు సంస్థల్లో స్థానికులకు 75 శాతం రిజర్వేషన్లు, కళాశాల విద్యార్థినులకు స్కూటీలు, యువతకు రూ.10 లక్షల రుణాలు, రూ.4 వేల నిరుద్యోగ భృతి వంటి హామీల అమలు ఎక్కడిదాకా వచ్చిందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపైనా ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. "అప్పుడు యూత్ డిక్లరేషన్ అంటూ యువతకు ఆశలు కల్పించారు. ఇప్పుడు హామీల గురించి అడిగితే ఎదురుదాడి చేస్తున్నారు" అని



విమర్శించారు. ఉద్యోగ నోటిఫికేషన్ల విషయంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించిన కేటీఆర్.. "నోటిఫికేషన్ లేదు.. లూటిఫికేషన్ మాత్రం నడుస్తోంది. జాబ్ క్యాలెండర్ లేదు.. స్కామ్ క్యాలెండర్ నడుస్తోంది" అంటూ ఎద్దేవా చేశారు. ప్రభుత్వంలో విజన్ లేదని, విధ్వంసమే కనిపిస్తోందని విమర్శించారు. అశోక్‌నగర్‌లో రాహుల్ గాంధీ యువతకు ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఎన్నికల తర్వాత యువత సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిపై కూడా కేటీఆర్ పలు తీవ్ర ఆరోపణలు చేశారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజా సమస్యలపై నిలదీస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. కష్టపడి సాధించుకున్న తెలంగాణను పదేళ్లపాటు అభివృద్ధి పథంలో నడిపించామని పేర్కొన్నారు. కాంగ్రెస్ హామీలను నమ్మి ప్రజలు అధికారం అప్పగించారని, కానీ అన్ని వర్గాలను ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. యువత పిడికిలి బిగిస్తే ఎంతటి ప్రభుత్వమైనా దిగిరావాల్సిందేనని కేటీఆర్ అన్నారు. "వెయ్యి రోజులైనా హామీలు అమలు చేయలేని రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలి. కేసీఆర్‌ను రాజీనామా చేయమనడం కాదు.. ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు లెక్క చెప్పాలి" అని డిమాండ్ చేశారు.

# రేపటి నుంచి అసెంబ్లీ సమరం

మొదటి పేజీ తరువాయి

అందించడంతో పాటు సమావేశాల సమయంలో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. సమావేశాల నిర్వహణ, సభ్యులకు వసతులు, భద్రతా ఏర్పాట్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ అధికారులు, డీజీపీతో పాటు పోలీసు ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. గత సమావేశాల కంటే మరింత వేగంగా, సమన్వయంతో అధికారులు పనిచేయాలని గుత్తా సుఖేందర్‌రెడ్డి సూచించారు. ఈసారి సమావేశాలు వాడీవేడిగా జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. సభకు సంబంధించిన అన్ని శాఖల అధికారులు సమావేశాలు జరిగే సమయంలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సభ్యులకు అవసరమైన సమాచారాన్ని తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో ముందుగానే అందించాలని సూచించారు. సభ లోపల,



బయట ప్రశాంత వాతావరణం ఉండేలా పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండాలని స్పీకర్, ఛైర్మన్ ఆదేశించారు. ధర్నాలు, రాస్తారోకోలు తదితర ఆందోళనల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు నిఘా సమాచారాన్ని ఎప్పటికప్పుడు అసెంబ్లీ అధికారులకు చేరవేసేలా సమన్వయం చేసుకోవాలని సూచించారు. సమావేశాల నిర్వహణ కోసం నోడల్ అధికారులను నియమించాలని పేర్కొన్నారు. సభ్యులు అడిగే ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలను ఒకరోజు ముందుగానే అందించాలని శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖ నుంచి ఒక అధికారి నిరంతరం అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఉభయ సభల సమావేశాల నిర్వహణ ప్రభుత్వ కార్యనిర్వాహక వ్యవస్థ సమర్థతకు నిదర్శనంగా నిలవాలని పేర్కొన్నారు. ప్రభుత్వం తరఫున సమావేశాల నిర్వహణకు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామని తెలిపారు. వర్షాకాల సమావేశాల్లో ప్రభుత్వం పలు కీలక బిల్లులను సభ ముందుకు తీసుకురావడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుపై చర్చించేందుకు సిద్ధమవుతోంది. మరోవైపు ప్రజా సమస్యలు, ప్రభుత్వ హామీలు, పాలనాపరమైన అంశాలపై అధికార పక్షాన్ని నిలదీసేందుకు విపక్షాలు అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నాయి. దీంతో ఈసారి ఉభయ సభల్లో అధికార, విపక్షాల మధ్య వాడీవేడి చర్చలు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. అసెంబ్లీ, శాసనమండలి సమావేశాలు ఎన్ని రోజులపాటు కొనసాగాలన్నది బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఖరారు కానుంది.

# '22ఏ' పేరుతో భూదందా!

**ప్రజల భూములు లాక్కునే కుట్ర: రాంచందర్‌రావు**

**కేసీఆర్ బాటలోనే రేవంత్ సర్కార్**

**హైడ్రా, క్యూర్‌తో ప్రజల్లో భయాందోళనలు**

**బాధిత భూములపై వెంటనే సమీక్షకు డిమాండ్**

**న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని స్పష్టం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్):** సామాన్యుల ఆస్తులు, రైతుల పొలాలను లక్ష్యంగా చేసుకుని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం భూదందా సాగిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తీవ్రంగా ఆరోపించారు. 22ఏ నిషేధిత జాబితా పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల సొంత భూములను లాక్కునేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శించారు. ప్రజల భూముల జోలికి వెళ్లిన ఏ ప్రభుత్వానికైనా పతనం తప్పదని హెచ్చరించారు. ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నాయకత్వంలో నిర్వహించిన మహాధర్నాలో రాంచందర్‌రావు పాల్గొని మాట్లాడారు. 22ఏ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితుల భూములపై ప్రభుత్వం వెంటనే సమీక్ష చేపట్టి, అర్హమైన వాటిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై కూడా రాంచందర్‌రావు విమర్శలు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం 'ధరణి' పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసి చివరకు అధికారాన్ని కోల్పోయిందని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోందని ఆరోపించారు. గత ప్రభుత్వ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తన గోతిని తానే తవ్వుకుంటోందని వ్యాఖ్యానించారు. హైడ్రా, క్యూర్, 22ఏ వంటి నిర్ణయాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ వ్యవహారాల్లో 30 శాతం కమీషన్ల కోసమే ప్రభుత్వం పనిచేస్తోందంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల సొంత భూములపై అనిశ్చితి సృష్టించడం సరికాదని రాంచందర్‌రావు అన్నారు. 22ఏ జాబితాలో చేరిన భూములను ప్రభుత్వం సమగ్రంగా



పరిశీలించి, అన్యాయంగా నమోదైన వాటిని వెంటనే తొలగించాలని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే బీజేపీ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. "ప్రజల భూములపై కన్నేసిన పాలకులు చరిత్రలో బాగుపడలేదు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ రాజీలేని పోరాటం కొనసాగిస్తుంది" అని రాంచందర్‌రావు స్పష్టం చేశారు.

# 'రైతులను మళ్లీ రోడ్డెక్కించారు!'

**కేసీఆర్ హయాంలో 24 గంటల కరెంట్**

**మాజీ మంత్రి హరీష్‌రావు**

**ఇప్పుడు విద్యుత్, యూరియా కోసం రైతుల పాట్లు**

**రైతుబంధులో 29 వేల కోట్లు ఎగ్గొట్టారని ఆరోపణ**

**ఇచ్చిన హామీలనే అమలు చేయాలని డిమాండ్**

**దుబ్బాక, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్):** "మా తెలంగాణ మాకు కావాలని నాడు రోడ్లపై వంటావార్పు చేసి రాష్ట్రాన్ని సాధించుకున్నాం. పదేళ్లు కేసీఆర్ నాయకత్వంలో రైతులు ప్రశాంతంగా ఉన్నారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి పాలనలో మళ్లీ రైతులు వంటావార్పులతో రోడ్లపైకి రావాల్సిన పరిస్థితి వచ్చింది" అని మాజీ మంత్రి హరీష్‌రావు విమర్శించారు. తాము కొత్తగా గొంతెమ్మ కోరికలు కోరడం లేదని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన హామీలనే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామని స్పష్టం చేశారు. రైతు సమస్యలు, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు నిరసనగా దుబ్బాక నియోజకవర్గంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'రైతు పొలికేక' కార్యక్రమంలో హరీష్‌రావు పాల్గొని మాట్లాడారు. విద్యుత్, రైతుబంధు, రైతుబీమా, యూరియా, ధాన్యం కొనుగోలు, సాగునీరు తదితర అంశాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ అందించామని హరీష్‌రావు పేర్కొన్నారు. ఇప్పుడు ఎనిమిది గంటలు కూడా సక్రమంగా విద్యుత్ రావడం లేదని రైతులు ఫోన్లు చేస్తున్నారని చెప్పారు. కేసీఆర్ రూ.10 వేలు ఇస్తే తాము రూ.15 వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ చెప్పిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఉన్న సాయాన్నే పూర్తిస్థాయిలో అందించడం లేదని హరీష్‌రావు ఆరోపించారు. మూడేళ్లలో రైతులకు రావాల్సిన రైతుబంధులో రూ.29 వేల కోట్లు ప్రభుత్వం ఎగ్గొట్టిందని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం డీఏపీ ధరలను భారీగా పెంచిందని విమర్శిస్తూనే.. రాష్ట్ర ప్రభుత్వం యాప్‌ల విధానంతో రైతులకు మరిన్ని ఇబ్బందులు తెచ్చిందని ఆరోపించారు. ధాన్యం కొనుగోలులో మిల్లర్లు బస్తాకు ఐదు కిలోల వరకు తరుగు తీస్తున్నారని హరీష్‌రావు ఆరోపించారు. తరుగు తీస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గతంలో చెప్పిన ముఖ్యమంత్రి ఇప్పుడు మిల్లర్లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, నిరుద్యోగులు, మహిళలు సహా అన్ని వర్గాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని హరీష్‌రావు ఆరోపించారు. పెన్షన్ల పెంపు, కల్యాణలక్ష్మితో




తులం బంగారం తదితర ఎన్నికల హామీలను అమలు చేయలేదని విమర్శించారు. "కరెంట్, రైతుబంధు, రైతుబీమా.. ఇవన్నీ మళ్లీ పక్కాగా అందాలంటే కేసీఆర్ నాయకత్వం రావాలి. కాంగ్రెస్ చేసిన మోసాలకు రైతులు, మహిళలు ఓటుతో సమాధానం చెప్పే సమయం వస్తుంది" అని హరీష్‌రావు పేర్కొన్నారు.

# సీఎంను దూషించలేదు

**కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**



**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై అవకాశం దొరికినప్పుడల్లా విమర్శనాస్త్రాలు సంధించే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఒక్కసారిగా యు-టర్న్ తీసుకున్నారు. తాను రేవంత్ రెడ్డిని ఎప్పుడూ దూషించలేదని, కేవలం ఒకట్రెండు అంశాల్లో మాత్రమే అభిప్రాయ భేదాలు వచ్చాయని క్లారిటీ ఇచ్చారు. రేవంత్‌తో తనకు ఎలాంటి వ్యక్తిగత వైరం లేదని స్పష్టం చేసిన ఆయన, సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్, డిప్యూటీ సీఎం నియోజకవర్గం మధిర స్థాయిలోనే తన మునుగోడు నియోజకవర్గానికి కూడా రూ. 2 వేల కోట్ల నిధులు వచ్చాయని ప్రశంసల జల్లు కురిపించారు. త్వరలో జరగబోయే సీఎం బహిరంగ సభకు వేలాది మంది కార్యకర్తలతో తరలివెళతానని చెప్పారు.

# ఎవరు పడితే వాళ్లను పార్టీలోకి చేర్చుకోబోం

**కొండా సురేఖ చేరికపై బీజేపీ నేత మురళీధర్ రావు**



**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్):** మాజీ మంత్రి కొండా సురేఖ బీజేపీలో చేరనున్నారంటూ వస్తున్న వార్తలపై ఆ పార్టీ సీనియర్ నేత మురళీధర్‌రావు స్పందించారు. ఈ ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చుతూ, పార్టీలో చేరికలపై తమకంటూ ఒక స్పష్టమైన విధానం ఉందని తెలిపారు. "ఎవరిని పడితే వారిని పార్టీలో చేర్చుకోబోం" అని ఆయన శనివారం స్పష్టం చేశారు. కొండా సురేఖ చేరిక ప్రచారం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని మురళీధర్‌రావు ఆరోపించారు. "ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో అంతర్గత సంక్షోభం నెలకొంది. ఆ అంశం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇటువంటి కథనాలను ప్రచారంలోకి తెస్తున్నారు" అని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాజకీయాలపై మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు బీజేపీనే సరైన ప్రత్యామ్నాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో బీజేపీ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. మురళీధర్ రావు చేసిన ఈ వ్యాఖ్యలతో కొండా సురేఖ చేరికపై జరుగుతున్న ప్రచారానికి తెరపడినట్లయింది.

# కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి

**రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్**



**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్):** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి తక్షణమే రాజీనామా చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధిగా తన బాధ్యతలు నిర్వర్తించని వ్యక్తి ఆ పదవిలో కొనసాగడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయమై ఈ నెల 6న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద 'మహా ధర్నా' నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ధర్నాకు సంబంధించిన సన్నాహక సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రానికి వందేళ్ల నష్టం వాటిల్లిందని విమర్శించారు. "వెయ్యి రోజులుగా ఎమ్మెల్యేగా వేతనం తీసుకుంటున్న కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని, కనీసం తన నియోజకవర్గ ప్రజలకు కూడా అందుబాటులో ఉండటం లేదు. ప్రతిపక్ష నేతగా ఆయన పూర్తిగా విఫలమయ్యారు" అని ఆరోపించారు. కేసీఆర్ వైఖరిని ప్రజల దృష్టికి తీసుకెళ్లడానికే ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఇదే వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామని ఆయన తెలిపారు. ఈ మహా ధర్నాను విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

# 11 రోజుల తర్వాత శిథిలాల కింద ఇద్దరు సజీవం..

**1,344కు పెరిగిన మృతులు**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6 (సమయం న్యూస్):** నేపాల్‌ను తీవ్రంగా కుదిపివేసిన ఆకస్మిక వరదలు, కొండచరియల విపత్తులో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రమాదం సంభవించి 11 రోజులు గడిచినా, శనివారం ఇద్దరిని సజీవంగా కాపాడటం బాధితుల్లో కొత్త ఆశలు రేకెత్తించింది. అపర్ త్రిశూలీ-1 జలవిద్యుత్ ప్రాజెక్టు సొరంగం లోపలి నుంచి ఒక విదేశీయుడిని (చైనా పౌరుడు) రక్షించగా, నువాకోట్ జిల్లా బిదూర్‌లో భవన శిథిలాల కింద చిక్కుకున్న 64 ఏళ్ల చండికా శ్రేష్ఠ అనే వృద్ధురాలిని నేపాల్ సైన్యం సురక్షితంగా బయటకు తీసింది. బాధితులకు మెరుగైన వైద్యం కోసం హెలికాప్టర్ ద్వారా కాఠ్‌మాండ్ ఆసుపత్రికి తరలించారు. మరోవైపు వరదల్లో మృతి చెందిన వారి సంఖ్య ఇప్పటివరకు 1,344కు చేరుకోగా, మరో 5 వేల మంది వరకు ఆచూకీ లభించాల్సి ఉంది. మృతదేహాలు తీవ్రంగా దెబ్బతినడంతో గుర్తింపు ప్రక్రియ క్లిష్టంగా మారింది. అధికారులు డీఎన్ఏ నమూనాలు సేకరించి ఇప్పటివరకు 1,030 మృతదేహాలను తాత్కాలికంగా ఖననం చేయగా, కేవలం 96 మృతదేహాలను మాత్రమే కుటుంబ సభ్యులకు అప్పగించారు. సైన్యం, అంతర్జాతీయ రెస్క్యూ బృందాలు హెలికాప్టర్లు, తాత్కాలిక వంతెనల సహాయంతో మారుమూల ప్రాంతాల్లోనూ గాలింపు, సహాయక చర్యలను వేగవంతం చేస్తున్నాయి.



## సంపాదకీయం



# యుద్ధం కాదు.. దౌత్యమే మార్గం!

**ప్రతీకార దాడులతో మరింత రగులుతున్న అమెరికా-ఇరాన్ ఘర్షణ**

**చమురు రవాణా మార్గాలే లక్ష్యాలైతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ముప్పు**

**హోర్ముజ్‌లో ఉద్రిక్తత పెరిగితే ఇంధన ధరలపై తీవ్ర ప్రభావం**

**ఆయుధాలకు విరామమిచ్చి చర్చల బాట పట్టాల్సిన సమయం**

అమెరికా-ఇరాన్ మధ్య మళ్లీ పెరుగుతున్న సైనిక ఉద్రిక్తతలు ప్రపంచ శాంతికి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. అమెరికా నౌకలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిందని అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించడం.. ప్రతీకారంగా ఇరాన్‌కు చెందిన క్రూడ్ ఆయిల్ రవాణా నౌకలపై అమెరికా దాడులు చేసినట్లు వార్తలు రావడం.. పరిస్థితి ఎంత వేగంగా అదుపు తప్పుతోందో తెలియజేస్తున్నాయి. ఒకరి దాడికి మరొకరు ప్రతీకారం తీర్చుకునే ధోరణి కొనసాగితే ఇది రెండు దేశాల మధ్య ఘర్షణగానే మిగిలిపోదు. మొత్తం మధ్యప్రాచ్యాన్ని మరో యుద్ధ సుడిగుండంలోకి నెట్టే ప్రమాదముంది. ఇరాన్ చమురు ఎగుమతులకు కీలకమైన ఖార్గ్ ద్వీపం పరిసరాల్లోనూ చమురు ట్యాంకర్‌పై దాడి జరిగినట్లు వస్తున్న వార్తలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ఘటనలపై పూర్తి అధికారిక వివరాలు వెలువడాల్సి ఉన్నప్పటికీ.. ఇంధన ఉత్పత్తి, రవాణా వ్యవస్థలే ప్రత్యక్ష లక్ష్యాలుగా మారితే దాని ప్రభావం యుద్ధభూమికి వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న దేశాలపైనా పడుతుంది.

### హోర్ముజ్ రగిలితే.. ప్రపంచానికే సెగ

మధ్యప్రాచ్యంలో జరిగే ప్రతి సైనిక ఘర్షణను ఆ ప్రాంత సమస్యగా మాత్రమే చూడలేం. ప్రపంచ ఇంధన రవాణాలో హోర్ముజ్ జలసంధికి అత్యంత కీలక స్థానం ఉంది. అక్కడ ఉద్రిక్తతలు పెరిగినా, నౌకల రాకపోకలకు అంతరాయం ఏర్పడినా అంతర్జాతీయ మార్కెట్లలో ముడిచమురు ధరలు ఒక్కసారిగా ఎగిసే అవకాశం ఉంటుంది. చమురు ధర పెరిగితే దాని ప్రభావం పెట్రోలు, డీజిల్‌తో ఆగదు. రవాణా వ్యయం పెరుగుతుంది. ఉత్పత్తి ఖర్చులు అధికమవుతాయి. నిత్యావసర వస్తువుల ధరలపై ఒత్తిడి పడుతుంది. విమానయానం నుంచి పరిశ్రమల వరకు అనేక రంగాలు ప్రభావితమవుతాయి. చివరకు యుద్ధ నిర్ణయాలు తీసుకునేది పాలకులైనా.. వాటి ఆర్థిక మూల్యం చెల్లించేది మాత్రం సామాన్య ప్రజలే.

### ప్రతీకారానికి అంతమెక్కడ?

యుద్ధంలో అత్యంత ప్రమాదకరమైన పదం 'ప్రతీకారం'. ఒక దాడికి మరో దాడి.. దానికి ప్రతిగా ఇంకో దాడి.. ఇలా సాగితే ఎక్కడ ఆగాలన్నది చివరకు ఎవరి చేతుల్లోనూ ఉండదు. మొదట పరిమిత లక్ష్యాలపై ప్రారంభమైన సైనిక చర్యలు క్రమంగా కీలక మౌలిక వసతులు, ఇంధన కేంద్రాలు, నౌకాశ్రయాలు, చివరకు జనావాసాలను కూడా ప్రమాదంలోకి నెట్టవచ్చు. దేశాల భద్రతా ప్రయోజనాలను ఎవరూ తక్కువ చేయలేరు. తమ భూభాగం, ప్రజలు, సైనిక బలగాలను రక్షించుకోవడం ప్రతి దేశానికీ హక్కే. కానీ భద్రత పేరుతో అంతులేని ప్రతీకార చక్రాన్ని కొనసాగించడం సమస్యకు పరిష్కారం కాదు. అది మరింత అస్థిరతకు బాట వేస్తుంది.

### చర్చలకు తలుపులు ఇంకా మూసుకుపోలేదు

ఈ తీవ్ర ఉద్రిక్తతల మధ్య కూడా దౌత్యానికి అవకాశం పూర్తిగా కనుమరుగైందని భావించాల్సిన అవసరం లేదు. తాత్కాలిక ఒప్పందంలోని కట్టుబాట్లను అమెరికా పాటిస్తే తాము కూడా సహకరిస్తామని ఇరాన్ నాయకత్వం చెబుతుండటం చర్చలకు ఇంకా కొంత స్థలం మిగిలి ఉందనే సంకేతంగా చూడాలి. ఇక్కడే అంతర్జాతీయ సమాజం పాత్ర కీలకం. ఐక్యరాజ్యసమితి సహా ప్రభావవంతమైన దేశాలు కేవలం 'సంయమనం పాటించండి' అనే ప్రకటనలకే పరిమితం కాకూడదు. అమెరికా-ఇరాన్ మధ్య ప్రత్యక్ష లేదా మధ్యవర్తిత్వ చర్చలకు వేదికను సిద్ధం చేయాలి. ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన భద్రతా హామీలు, ఇంధన రవాణాకు రక్షణ, పరస్పర దాడుల నిలిపివేత వంటి అంశాలపై తక్షణ చర్చలు జరగాలి.

### గెలిచేది ఎవరు.. ఓడేది ఎవరు?

ప్రపంచం ఇప్పటికే యుద్ధాలు, ఆర్థిక అనిశ్చితి, వాణిజ్య ఉద్రిక్తతలు, ఇంధన ధరల ఒత్తిడితో సతమతమవుతోంది. ఈ సమయంలో మధ్యప్రాచ్యంలో మరో దీర్ఘకాలిక యుద్ధం మొదలైతే అది ఏ ఒక్క దేశానికీ మేలు చేయదు. యుద్ధరంగంలో సైనిక విజయం సాధించవచ్చు.. కానీ కోల్పోయిన ప్రాణాలను తిరిగి తీసుకురాలేం. కూలిపోయిన ఆర్థిక వ్యవస్థలను ఒక్కరోజులో నిలబెట్టలేం. ప్రజల మధ్య పెరిగిన ద్వేషాన్ని ఒక ఒప్పందంతో చెరిపేయలేం. అందుకే అమెరికా, ఇరాన్ రెండూ సంయమనం పాటించాల్సిన సమయం ఇది. క్షిపణికి క్షిపణి.. దాడికి దాడి సమాధానం కాదు. చర్చకు చర్చే సమాధానం. ఆయుధాలు సమస్యను వాయిదా వేయగలవేమో కానీ.. శాశ్వత పరిష్కారాన్ని ఇవ్వగలిగేది దౌత్యమే. యుద్ధంలో ఎవరు గెలిచారన్నది చరిత్ర రాసుకోవచ్చు.. కానీ ప్రతి యుద్ధంలోనూ ముందుగా ఓడిపోయేది మానవత్వమే!

# శతాబ్దం దాటినా.. విద్యా ప్రతిభలో ప్రత్యేక ముద్ర

- శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ శతాబ్ది వేడుకల్లో ప్రధాని మోదీ
- తరతరాల నాయకులను తీర్చిదిద్దిందంటూ ప్రశంస
- జెన్-జీ విద్యార్థులతో ముఖాముఖి
- మెట్రోలో కళాశాలకు చేరుకున్న మోదీ



**ఢిల్లీ, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్):** దేశంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో ఒకటైన ఢిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం రోజున జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మోదీ.. వందేళ్లుగా విద్యారంగానికి కళాశాల అందిస్తున్న సేవలను ప్రశంసించారు. వ్యాపారం, ప్రజాజీవితం, సామాజిక రంగాల్లో తరతరాల నాయకులను తీర్చిదిద్దడంలో ఈ విద్యాసంస్థ విశిష్టమైన ముద్ర వేసిందని కొనియాడారు. శతాబ్ది ఉత్సవాలకు ముందు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించిన ప్రధాని.. విద్యా ప్రతిభ, సంస్థాగత నిర్మాణంలో శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ ప్రత్యేక గుర్తింపు సాధించిందని పేర్కొన్నారు. వందేళ్ల ప్రయాణంలో దేశ అభివృద్ధికి అవసరమైన ప్రతిభావంతులను అందించడంలో కళాశాల పాత్రను అభినందించారు. ఉపాధ్యాయ దినోత్సవం రోజునే శతాబ్ది ఉత్సవాలు జరగడం ప్రత్యేకతను సంతరించుకుంది. కళాశాల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ జెన్-జీ విద్యార్థులతో నేరుగా ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థుల ఆలోచనలు, ఆకాంక్షలు, భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. యువత తమ అభిప్రాయాలను ప్రధానితో నేరుగా పంచుకునేందుకు ఈ కార్యక్రమం వేదికగా నిలిచింది. శతాబ్ది ఉత్సవాలకు హాజరయ్యేందుకు ప్రధాని మోదీ ఢిల్లీ మెట్రోలో ప్రయాణించి కళాశాల ప్రాంగణానికి చేరుకున్నారు. మెట్రో ప్రయాణంలో చిన్నారులు, మహిళలు, ఇతర ప్రయాణికులతో ముచ్చటించారు. ప్రధానితో మాట్లాడేందుకు అవకాశం రావడంతో ప్రయాణికుల్లో ఉత్సాహం కనిపించింది. కామర్స్, ఎకనామిక్స్, మేనేజ్‌మెంట్ విద్యలో ప్రముఖ సంస్థగా గుర్తింపు పొందిన శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ 1926లో ఆవిర్భవించింది. ప్రముఖ పారిశ్రామికవేత్త, దాత సర్ శ్రీరామ్ చొరవతో ఏర్పాటైన ఈ విద్యాసంస్థ వందేళ్ల ప్రయాణంలో అనేక రంగాలకు ప్రతిభావంతులను అందించింది. పారిశ్రామికవేత్తలు, పరిపాలనాధికారులు, విధాన నిర్ణేతలు, ప్రజాజీవితంలో ప్రముఖులుగా ఎదిగిన అనేక మంది ఈ కళాశాల నుంచి విద్యనభ్యసించారు. శతాబ్ది మైలురాయిని చేరుకున్న శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్.. గత వైభవాన్ని గుర్తుచేసుకుంటూనే కొత్తతరం విద్యార్థులతో మరో శతాబ్దపు ప్రయాణానికి అడుగుపెట్టింది.

# బస్తర్ మావోయిస్టుల దాడి కేసు

- 10 మందికి శిక్ష ఖరారు
- జగదల్‌పూర్ ప్రత్యేక కోర్టు తీర్పు
- సెప్టెంబర్ 16న శిక్షల ప్రకటన
- దోషుల్లో ముగ్గురు మహిళలు




**జగదల్‌పూర్, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్):** ఛత్తీస్‌గఢ్‌లో తీవ్ర సంచలనం సృష్టించిన 2013 జీరమ్ లోయ మావోయిస్టు దాడి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కాంగ్రెస్ నాయకుల కాన్వాయ్‌పై జరిగిన ఈ దాడికి సంబంధించిన కేసులో ముగ్గురు మహిళలు సహా మొత్తం 10 మందిని జగదల్‌పూర్ ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు దోషులుగా నిర్ధారించింది. ప్రత్యేక న్యాయమూర్తి అభయ్ సింగ్ రాజ్‌పుత్ తీర్పు వెల్లడించారు. దోషులకు విధించే శిక్షలను సెప్టెంబర్ 16న ప్రకటించనున్నారు. 2013 మే 25న బస్తర్ ప్రాంతంలోని దర్భా పోలీస్‌స్టేషన్ పరిధిలోని జీరమ్ లోయ వద్ద ఈ దాడి జరిగింది. కాంగ్రెస్ నిర్వహించిన 'పరివర్తన్ ర్యాలీ' ముగించుకుని నాయకులు తిరిగి వెళ్తుండగా మావోయిస్టులు వారి కాన్వాయ్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో 29 మంది ప్రాణాలు కోల్పోయారు. నాటి ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ అధ్యక్షుడు నందకుమార్ పటేల్, ఆయన కుమారుడు దినేష్, మాజీ ప్రతిపక్ష నేత మహేంద్ర కర్మ, మాజీ ఎమ్మెల్యే ఉదయ్ ముద్లియార్‌తో పాటు పలువురు భద్రతా సిబ్బంది, పౌరులు ఈ దాడిలో మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మాజీ కేంద్ర మంత్రి విద్యాచరణ్ శుక్లా అనంతరం చికిత్స పొందుతూ మరణించారు. ఈ ఘటన అప్పట్లో ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ నాయకత్వానికి తీవ్ర నష్టాన్ని మిగిల్చింది.

### 101 మంది సాక్షుల విచారణ

తొలుత బస్తర్ పోలీసులు కేసు నమోదు చేయగా.. ఘటన తీవ్రత దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం దర్యాప్తును జాతీయ దర్యాప్తు సంస్థకు అప్పగించింది. సుదీర్ఘ దర్యాప్తు అనంతరం ఎన్ఐఏ 2014 సెప్టెంబర్‌లో జగదల్‌పూర్ ప్రత్యేక కోర్టులో అభియోగపత్రం దాఖలు చేసింది. విచారణలో భాగంగా 101 మంది సాక్షులను విచారించినట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన అంశాల పరిశీలనకు రెండు న్యాయ విచారణ కమిషన్లు కూడా ఏర్పాటయ్యాయి. ఏళ్ల తరబడి సాగిన విచారణ అనంతరం తాజాగా 10 మందిని దోషులుగా నిర్ధారిస్తూ ప్రత్యేక కోర్టు తీర్పు వెలువరించింది. వారికి ఎంత మేర శిక్ష విధించాలన్న అంశంపై ఈ నెల 16న న్యాయస్థానం నిర్ణయం ప్రకటించనుంది.

### తీర్పుతో మళ్లీ రాజకీయ వేడి

కోర్టు తీర్పు నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి రాజకీయ విమర్శలు మొదలయ్యాయి. దర్యాప్తులో అనేక వాస్తవాలు వెలుగులోకి రాలేదని మాజీ ముఖ్యమంత్రి భూపేష్ బాఘేల్ ఆరోపించారు. అప్పటి ప్రభుత్వం కాంగ్రెస్ నాయకులకు తగిన భద్రత కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. ఈ ఆరోపణలను మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నేత రమణ్ సింగ్ తోసిపుచ్చారు. అత్యంత సున్నితమైన జీరమ్ లోయ దాడి అంశాన్ని కాంగ్రెస్ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటోందని ఆయన విమర్శించారు. ఛత్తీస్‌గఢ్ రాజకీయ చరిత్రలో చెరగని విషాదంగా మిగిలిన జీరమ్ లోయ దాడి కేసులో 13 ఏళ్ల తర్వాత వెలువడిన ఈ తీర్పు కీలక ఘట్టంగా మారింది. ఇప్పుడు దోషులకు సెప్టెంబర్ 16న కోర్టు ఎలాంటి శిక్షలు విధిస్తుందన్నదానిపై ఉత్కంఠ నెలకొంది.

# పోలీసులకే సవాల్.. చివరకు కటకటాల్లోకి!

**సీజేపీ నిరసనల ఘటనలో ఇన్‌ఫ్లుయెన్సర్ అరెస్ట్**

**దాడి చేశానంటూ ఇంటర్వ్యూలో వ్యాఖ్యలు**

**బాధితుడి కుమార్తె ఫిర్యాదుతో పోలీసుల చర్య**

**ఆత్మరక్షణ కోసమే దాడి చేశానన్న భరద్వాజ్**

**కోర్టు అనుమతితో ఒక రోజు పోలీసు కస్టడీ**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్):** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జూలైలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన నిరసనల సందర్భంగా జరిగిన దాడి వ్యవహారం మరోసారి చర్చనీయాంశమైంది. నిరసనల్లో పాల్గొన్న నిషు ఆజాద్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సామాజిక మాధ్యమ ఇన్‌ఫ్లుయెన్సర్ స్వతంత్ర భరద్వాజ్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. కోర్టులో హాజరుపరిచిన అనంతరం తదుపరి విచారణ కోసం ఒక రోజు పోలీసు కస్టడీకి తీసుకున్నారు. నిరసనల సమయంలో భరద్వాజ్ తన తండ్రి తలపై ఓ వస్తువుతో దాడి చేశాడని, దాంతో ఆయన గాయపడ్డారని నిషు ఆజాద్ ఫిర్యాదులో ఆరోపించారు. ఈ ఘటనకు సంబంధించి భరద్వాజ్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. ఓ నిరసనకారురాలి తండ్రిపై తాను దాడి చేసినట్లు భరద్వాజ్ ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు. బాధితుడి తలకు తీవ్ర గాయమై పెద్ద సంఖ్యలో కుట్లు పడి ఉండవచ్చని చెప్పాడు. అంతటితో ఆగకుండా.. అలాంటి దాడి హత్యాయత్నం పరిధిలోకి రావచ్చని పేర్కొంటూనే రాజకీయ పలుకుబడి కారణంగా పోలీసులు తనను అరెస్ట్ చేయలేదని వ్యాఖ్యానించాడు. ఈ వ్యాఖ్యలతో కూడిన వీడియో వైరల్ కావడంతో పోలీసుల తీరుపైనా విమర్శలు వ్యక్తమయ్యాయి. భరద్వాజ్ వ్యాఖ్యలపై స్పందించిన నిషు ఆజాద్ సామాజిక మాధ్యమంలో వీడియో విడుదల చేశారు. ఘటన జరిగిన సమయంలో పోలీసులు తమ ఫిర్యాదుపై కేసు నమోదు చేయడానికి నిరాకరించారని ఆమె ఆరోపించారు. తనకు న్యాయం చేయాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కోరారు. సామాజిక మాధ్యమాల్లో తనను వేధించడంతో పాటు లైంగిక దాడి బెదిరింపులు కూడా వస్తున్నాయని ఆమె ఆరోపించారు. ఈ వ్యవహారంపై రాజకీయ నేతలు కూడా స్పందించారు. నిందితుడిని అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, హత్యాయత్నం సహా ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంలోని సంబంధిత నిబంధనలు వర్తిస్తాయా అనే అంశాన్ని పరిశీలించాలని డిమాండ్లు వచ్చాయి. మరోవైపు నిషు ఆజాద్ ఆరోపణలపై పోలీసులు స్పందిస్తూ.. ఘటన సమయంలో బాధితుడికి స్వల్ప గాయాలైనట్లు ప్రాథమికంగా గుర్తించినందున అప్పట్లో కేసు నమోదు చేయలేదని పేర్కొన్నట్లు సమాచారం. భరద్వాజ్ మాత్రం తనపై వచ్చిన ఆరోపణలకు భిన్నమైన వాదన వినిపించాడు. ఘటన సమయంలో తనను 10 నుంచి 15 మంది చుట్టుముట్టారని, ఆ పరిస్థితుల్లో ఆత్మరక్షణ కోసమే దాడి చేయాల్సి వచ్చిందని తెలిపాడు. ప్రస్తుతం పోలీసులు ఇరుపక్షాల వాదనలు, అందుబాటులో ఉన్న వీడియోలు, ఇతర ఆధారాలను పరిశీలిస్తూ తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# లష్కర్ కమాండర్ హతం

**భద్రతా దళాల మెరుపు దాడి**

**బద్గాంలో సంయుక్త ఆపరేషన్**



**శ్రీనగర్, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్):** జమ్మూ కశ్మీర్‌లోని బద్గాం జిల్లా యూస్‌మార్గ్ పర్వత ప్రాంతంలో శనివారం ఉదయం భద్రతా దళాలు జరిపిన మెరుపు ఎన్‌కౌంటర్‌లో లష్కరే తొయిబాకు చెందిన కీలక పాకిస్థానీ కమాండర్ 'యాసిర్' హతమయ్యాడు. పర్వత ప్రాంతాల్లో ఉగ్రవాదులు సంచరిస్తున్నారనే పక్కా నిఘా సమాచారంతో భారత ఆర్మీకి చెందిన 53 రాష్ట్రీయ రైఫిల్స్, స్పెషల్ ఫోర్సెస్ బలగాలు సంయుక్తంగా తనిఖీ ఆపరేషన్ చేపట్టాయి. భద్రతా బలగాల రాకను గమనించి ఉగ్రవాది జరిపిన కాల్పులకు తిప్పికొట్టిన బలగాలు యాసిర్‌ను అక్కడికక్కడే మట్టుబెట్టాయి. భద్రతా వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. యాసిర్ గతంలో 2025 పహల్గామ్ దాడి సూత్రధారి, లష్కర్ ప్రసిద్ధ ఉగ్రవాది సులైమాన్ మూసా (హాషిమ్ మూసా) గ్రూప్‌లో కీలక సభ్యుడిగా పనిచేశాడు. ఏడాది క్రితం ఆ గ్రూప్ నుంచి విడిపోయిన యాసిర్, యూస్‌మార్గ్ ఎత్తైన పర్వత రహస్య ప్రాంతాల్లో ఉంటూ ప్రత్యేక ఉగ్ర నెట్‌వర్క్‌ను నడుపుతున్నాడు. గత కొంతకాలంగా ఇతని కదలికలపై గూఢచారి వర్గాలు నిఘా ఉంచాయి. ఇటీవల కశ్మీర్‌లో జరిగిన ఉగ్ర ఘటనలు, ప్లానింగ్‌లలో ఇతని ప్రమేయం ఉందా అన్న కోణంలో విచారణ ముమ్మరం చేశారు. శ్రీనగర్‌లోని దాచీగామ్ అటవీ ప్రాంతంలో సులైమాన్ మూసాను గతంలోనే భద్రతా దళాలు మట్టుబెట్టగా, ఇప్పుడు అతని ప్రధాన అనుచరుడు యాసిర్‌ను కూడా తుదముట్టించడంతో లష్కర్ నెట్‌వర్క్‌కు తీవ్ర విఘాతం కలిగింది.

# తెలంగాణ విద్యార్థులు దేశాభివృద్ధికి దిక్సూచి





- తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచే విధంగా.. నిలబడే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దాలి
- రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

**కొడంగల్ మున్సిపల్, సెప్టెంబర్,05(సమయం న్యూస్)** శనివారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదిన సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయ దినోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొని 123 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులను అందజేశారు. ముందుగా ఉపాధ్యాయ బృందంతో గ్రూప్ ఫోటో దిగి, కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఫోటో సోషల్ ఎగ్జిబిషన్ ను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డా. దామోదర్ రాజనర్సింహతో కలిసి సందర్శించారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ డా. యోగిత రాణా, విద్యా శాఖ కమిషనర్ దేవసేన ఛాయాచిత్ర ప్రదర్శన విశేషాలను వివరించారు. అనంతరం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విగ్ర హానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు పేద బడుగు బలహీనవర్గాలకు చెందిన విద్యార్థులే అధికంగా ఉంటారు కాబట్టి వారికి అత్యుత్తమైన నాణ్యమైన విద్యను బోధించి రాష్ట్రానికి, దేశానికి దిశానిర్దేశం చేసే స్థాయికి తీసుకువెళ్లాలని ఉపాధ్యాయులను కోరారు. విద్యార్థుల భవిష్యత్ కు పునాదులు వేసేది ఉపాధ్యాయులేనని, తల్లి దండ్రులకంటే విద్యార్థులు ఉపాధ్యాయుల వద్దనే ఎక్కువ సమయం గడుపుతారన్నారు. విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని సర్వేపల్లి రాధాకృష్ణన్ చెప్పారు. విద్యార్థుల భవిష్యత్ కోసం తమ అమూల్యమైన సమయాన్ని కేటాయిస్తున్న ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. విద్యాభివృద్ధిలో గతంలో 28 వ స్థానంలో ఉంటే ప్రజా ప్రభుత్వం అదికారంలోకి వచ్చాక 17 వ స్థానానికి చేరుకుందని ఇది ఉపాధ్యాయుల కృషితోనే సాధ్యమైందని కొనియాడారు. మిగతా రాష్ట్రాల్లో ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుతూపోతుంటే తెలంగాణ రాష్ట్రంలో మాత్రం ఈ రెండేళ్లల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 88 వేలు పెరిగారని వివరించారు. ఈ విజయం మీది.. తెలంగాణ ప్రజలదని ఉపాధ్యాయుల కృషిని కొనియాడారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో 95 శాతం అడ్మిషన్లు జరిగాయని, సాంకేతిక విద్యలో తెలంగాణ వేగంగా ముందుకెళుతోందన్నారు. సంక్షేమం, అభివృద్ధితో పాటు విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పించాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉంది కాబట్టి విద్యార్థుల భవిష్యత్ ను తీర్చిదిద్దడానికి సమర్థులైన వారిని యూనివర్సిటీల వీసీలుగా నియమించాం అన్నారు.

**ఉపాధ్యాయులకు నా విజ్ఞప్తి ఒక్కటే..**

ఉపాధ్యాయులు రోడ్డు మీదకు రావొద్దు.. వారి సమస్యలను పటిష్కరించాలనే ఆలోచనతో నేను ముందుకు వెళుతున్నా.. ప్రజా ప్రభుత్వంలో 55 రోజుల్లో డీఎస్సీ ద్వారా 10,006 మంది ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేసింది నిజం కాదా? ఒక్క ఫిర్యాదు లేకుండా అత్యంత పారదర్శకంగా 25,950 టీచర్ల ప్రమోషన్లు పూర్తి చేసింది నిజం కాదా?, చిన్న వివాదం లేకుండా 34,706 మంది ఉపాధ్యాయ బదిలీలను పారదర్శకంగా నిర్వహించామని గుర్తు చేసారు. భార్య ఒకచోట, భర్త మరోచోట ఉద్యోగం చేస్తూ ఎన్నో ఇబ్బందులు పడుతుంటే 317 జీవో సమస్యను పరిష్కరించినట్లు గుర్తుచేశారు. ఉపాష్యాయుల సమస్యలు పరిష్కరించాడానికి విద్య కమిషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కే కేశవరావును సలహాదారుగా నియమించి విద్యాశాఖ సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాల్లో అనేక సమస్యలు సృష్టించి దాదాపు 8.11 లక్షల కొట్లు అప్పులు చేసి వెళ్లిపోయారన్నారు. మీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా మీ సర్వీస్ ను 60 ఏళ్లకు పెంచారు. మీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెండింగ్ పెట్టి వెళ్లి ఆయన ఫామ్ హౌస్ లో పడుకుంటే...రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ప్రజా ప్రభుత్వం 90 రోజుల్లో 6 వేల కోట్లు చెల్లించిందన్నారు. ప్రతినెల ఒక వెయ్యి కోట్లు బకాయిల విడుదల కొరకు నిదులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఎప్పుడైనా ఏ రాష్ట్రంలోనైనా ప్రభుత్వ ఖర్చులతో ఉపాధ్యాయులను విదేశాలకు పంపి విద్యా విధానం అధ్యయనం చేయించారా? తెలంగాణ ప్రభుత్వం ఉపాధ్యాయులను విదేశాలకు పంపించింది నిజం కాదా? అని ప్రశ్నించారు. నేనే మీ ప్రతినిధిగా సమస్యలను పరిష్కరిస్తానని రెండేళ్లు నాకు అవకాశం ఇవ్వండి మీరు డెడికేటెడ్ గా విద్యార్థుల కోసం పనిచేయండి దేశ విద్యావ్యవస్థ కు దిక్సూచీగా తెలంగాణాను తీర్చిదిద్దుదామని సూచించారు. మనం చేస్తున్న మంచి పనులపై జాతీయ స్థాయిలో చర్చ జరగాలన్నారు. ఉపాధ్యాయులకు గుర్తింపు ఇవ్వాలని వారిని గౌరవించాలని 123 మంది టీచర్లకు అవార్డులు అందిస్తున్నాం.

ఇప్పుడు పీఆర్సీ ఇవ్వాలని శ్రీపాల్ అంటున్నాడు..విద్యా శాఖ మంత్రిగా, ముఖ్యమంత్రిగా ఒకటే విజ్ఞప్తి చేస్తున్నా...

రెండేళ్లు నాకు సమయం ఇవ్వండి.. ఆర్థిక వెసులుబాటునుబట్టి మీ సమస్యలు పరిష్కరిస్తా టీచర్లు రోడ్డె క్కితే రాష్ట్రానికి శుభసూచకం కాదు రెండేళ్ల తరువాత మీరు ఆశించినట్లుగా సమస్యలు పరిష్కరించకుంటే.. ఎన్నికల పరీక్షలో ఎన్ని మార్కులు వేయాలో మీరే నిర్ణయించుకోం డన్నారు. మీ ఉద్యోగ సర్వీస్ 30 ఏళ్లు ఉంటుంది.. మా సర్వీసు 5 సంవత్సరాలు, మేము ప్రతి 5 సంవత్సరాలకు పరీక్ష రాయాల్సి ఉంటుందన్నారు. రాజకీయ నాయకుల ఉచ్చులో పడకండి..పదేళ్లు విద్యా వ్యవస్థను విధ్వంసం చేశారు.

**విధ్వంసమైన విద్యా వ్యవస్థను వికాసం వైపు నడిపిద్దాం..**

అది మీ ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉంది మీకు ఉపాధ్యాయులకు ఎలాంటి చిన్న సమస్య కూడా రాకుండా చూసుకునే బాధ్యత నాది అని బయరోసా ఇచ్చారు. పాలిటెక్నిక్ విషయంలో జరుగుతున్న అవాస్తవ ప్రచారాన్ని నమ్మొద్దు మిమ్మల్ని అడ్డుపెట్టుకుని మమ్మల్ని బ్లాక్ మెయిల్ చేయాలని చూస్తున్నారు. దయచేసి అలాంటివారి ట్రాప్ లో పడొద్దని సూచించారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు మనమంతా పునరంకితమవుదామన్నారు. నర్సరీ నుంచి 12 వ తరగతి వరకు ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలి. 12వ తరగతి వరకు విద్యార్థులు జ్ఞానం, భావ వ్యక్తికరణ నేర్చుకోవాలి. 12వ తరగతి తర్వాత నైపుణ్యం సంపాదించుకోవాలి. నైపుణ్యం ఉంటే జర్మనీ, జపాన్ దక్షిణ కొరియ వంటి విదేశాల్లో మంచి ఉపాధి పొందెందుకు అపారమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. దీనికోసం ఐటిఐ విద్య వ్యవస్థను ఏటిసిగా మాచడం జరిగింది. పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీగా రూపుదిద్దడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ సమ సమాజ స్థాపనకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. భారతదేశంలో మాతృదేవోభవ పితృదేవోభవ ఆచార్యదేవోభవ అనే గొప్ప సిద్ధాంతం ఉందని అన్నారు. ప్రభుత్వము తీసుకుంటున్న పారదర్శకమైన విధానాల వల్ల తెలంగాణ రాష్ట్రంలో విద్యాభివృద్ధి గణనీయంగా పెరిగింది అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు కళాశాలలో విద్యార్థు ల చేరికలు గణనీయంగా పెరిగిందన్నారు. ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు సైతం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులకు శుభసాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసనసభ అధ్యక్షులు గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి సభ్యులు అద్దంకి దయాకర్, తాండూర్ శాసనసభ్యులు బి. మనోహర్ రెడ్డి, పరిగి శాసన సభ్యులు రామ్మోహన్ రెడ్డి విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ డాక్టర్ యోగిత రాణా, దేవసేన కమిషనర్, కళాశాల ప్రిన్సిపల్ సెక్రెటరీ అభిలాష అభినవ్, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నవీన్ నికోలస్, వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, స్థానిక మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, జిల్లా అధికారులు ఉత్తమ అవార్డు గ్రహీత ఉపాధ్యాయులు వారి బంధువులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రాధాకృష్ణన్‌సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకం

- ఉపాధ్యాయుల సేవలు సమాజానికి దిక్సూచి... సింగనబోయిన శ్రీశైలం

**వరంగల్, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్) :** భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలు దేశానికి చిరస్మరణీయమని ప్రైవేట్ టీచర్స్ యూనియన్ వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి సింగన బోయిన శ్రీశైలం అన్నారు. రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం వరంగల్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించడం ద్వారా విద్యారంగానికి, ఉపాధ్యాయుల సేవలకు సమాజం ఇస్తున్న గౌరవాన్ని చాటుతున్నామన్నారు. తత్వవేత్తగా, విద్యావేత్తగా, రాజనీతిజ్ఞుడిగా రాధాకృష్ణన్ దేశ ఖ్యాతిని ప్రపంచస్థాయికి తీసుకెళ్లారని కొనియాడారు. విద్యారంగ అభివృద్ధికి ఆయన చేసిన కృషి భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. బాధ్యతాయుతమైన పౌరస్ఫూర్తిని పెంపొందించడంలో ఉపాధ్యా యుల పాత్ర అత్యంత కీలకమన్నారు. విద్యార్థు ల భవిష్యత్తును తీర్చిదిద్దే గురువుల సేవలను సమాజం ఎల్లప్పుడూ గౌరవించాలని, వారికి తగిన గుర్తింపు, గౌరవం కల్పించాలని ఆకాంక్షించారు. సంగెం మండల బాధ్యులు రాజు, చెన్నారావుపేట మండల బాధ్యులు శ్రీనివాస్, మండల బాధ్యులు బట్టు నాగరాజు తదితరులు పాల్గొని రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు.



## 'కుడా' కొత్త సారథి... నగరంపై కొత్త ఆశలు..

- 'కుడా' చైర్‌పర్సన్ గుండు సుధారాణికి శుభాకాంక్షలు తెలిపిన రహమతుల్లా మహమ్మద్

**హనుమకొండ, సెప్టెంబరు 5 (సమయం న్యూస్) :** కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన గుండు సుధారాణిని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు రహమతుల్లా మహమ్మద్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సుధారాణి నాయకత్వంలో 'కుడా' మరింత చురుగ్గా పనిచేసి వరంగల్, హనుమకొండ నగరాల అభివృద్ధికి కొత్త ఊపునివ్వాలని రహమతుల్లా ఆకాంక్షించారు. వేగంగా విస్తరిస్తున్న పట్టణ ప్రాంతాలకు అనుగుణంగా మౌలిక వసతులను మెరుగుపరచడంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్యం, పచ్చదనం వంటి మౌలిక వసతులను అభివృద్ధి చేయడంతో పాటు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పట్టణ ప్రణాళికలు రూపొందించాలని కోరారు. చారిత్రక నగరమైన వరంగల్‌కు



ఆధునిక హంగులు అద్దుతూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని రహమతుల్లా అన్నారు. కుడా పరిధిలోని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. గుండు సుధారాణి అనుభవంతో 'కుడా'కు సమర్థవంతమైన నాయకత్వం అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేసిన ఆయన ఆమె పదవీకాలం విజయవంతంగా సాగాలని, 'కుడా' ఆధ్వర్యంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల మన్ననలు పొందాలని పేర్కొన్నారు.

## గురువులే భావితరాల రూపశిల్పులు

### గురువులే భావితరాల రూపశిల్పులు: కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, సెప్టెంబర్ 5( సమయం న్యూస్)** గురువులే భావితరాల రూపశిల్పులని, విద్యార్థులను జ్ఞానవంతులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైందని కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థు ల్లోవిద్యతో పాటు క్రమశిక్షణ, ధైర్యం పెంపొందించాలని సూచించారు. FLNపై ప్రత్యేక దృష్టి సారించి, కరీంనగర్‌ను విద్యారంగంలో అగ్రగామిగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారూ.

## చిట్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల ఘన సన్మానం



**కొడంగల్ మండలం, సెప్టెంబర్,05(సమయం న్యూస్)** కొడంగల్ మండలంలోని చిట్లపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల (MPUPS),లో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బనలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులందరినీ శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం హెచ్.ఎం మాట్లాడుతూ సమాజ ప్రగతికి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు మార్గదర్శకులు ఉపాధ్యాయులేనని, సర్వేపల్లి ఆదర్శాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు బనలక్ష్మి గారితో పాటు ఉపాధ్యాయులు అబ్దుల్ హక్, గోవర్ధన్, నాగప్ప, రాజు, జ్యోతి, అనిత తదితరులు పాల్గొన్నారు.

## బడా గణేష్ ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

### ఎమ్మెల్యే దానం నాగేందర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 5( సమయం న్యూస్)** ఖైరతాబాద్ బడా గణేష్ నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దానం నాగేందర్ సూచించారు. ఈ నెల 14 నుంచి 25 వరకు జరిగే ఉత్సవాలకు 50 లక్షలకు పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, బారికేడింగ్, ప్రసాదాల పంపిణీ తదితర ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, విద్యుత్, వైద్య, ఆర్అండ్‌బీ, దేవాదాయ, పోలీస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన పాఠశాలలను ప్రారంభించిన ముఖ్యమంత్రి



**కొడంగల్ నియోజకవర్గం,సెప్టెంబర్,05(సమయం న్యూస్)**

కొడంగల్, కోస్గిలో రూ.12 కోట్లతో ఆధునిక పాఠశాల భవనాల నిర్మాణం

అరబిందో ఫార్మా ఫౌండేషన్, అరబిందో ఫార్మా లిమిటెడ్ దాతృత్వ విభాగం సహకారంతో సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన పాఠశాల భవనాలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి శనివారం ప్రారంభించారు.అలాగే కోస్గి పట్టణంలో రూ.4 కోట్ల సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల నూతన భవన శిలా ఫలకాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం నూతన పాఠశాల భవనంలో గణపతి ,సరస్వతి ,వెంకటేశ్వర స్వామి చిత్రపటాలకు ముఖ్యమంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు, సౌకర్యవంతమైన విద్యా వాతావరణం కల్పించేందుకు ఈ పాఠశాల భవనాలు నిర్మించబడ్డాయనీ, సీఎస్ఆర్ నిధుల ద్వారా విద్యారంగ అభివృద్ధికి సహకరిస్తున్న అరబిందో ఫార్మా ఫౌండేషన్‌ను ఈ సందర్భంగా సీఎం అభినందించారు.ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, అరబిందో ఫార్మా ఫౌండేషన్ సీఎస్ఆర్ హెడ్ సదానంద రెడ్డి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అడ్మిన్ డాక్టర్ ఐ.ఎస్.ఆర్. రావు, ఇతర సీఎస్ఆర్ ప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు, జిల్లా విద్యాశాఖ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన ప్రశాంతంగా ముగింపు

### పోలీస్ సిబ్బందికి అభినందనలు



**కొడంగల్ మున్సిపల్, సెప్టెంబర్,05(సమయం న్యూస్)**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గ పర్యటన ఛార్మినార్ జోన్ డీఐజీ చందన దీప్తి, IPS ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య విజయవంతంగా, ప్రశాంతంగా ముగిసింది.

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ పరితోష్ పంకజ్, IPS మరియు జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా, IPS అభినందించారు.పర్యటనను విజయవంతంగా నిర్వహించడంలో ప్రతి ఒక్క అధికారి, సిబ్బంది సమన్వయంతో, క్రమశిక్షణతో, అప్రమత్తంగా విధులు నిర్వర్తించారని, వారి సమిష్టి కృషి అభినందనీయమని ఎస్పీ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన ప్రశాంతంగా, సజావుగా పూర్తయ్యేందుకు కృషి చేసిన ప్రతి ఒక్క పోలీస్ అధికారి మరియు సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## ఘనంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం



**వలిగొండ సెప్టెంబర్ 05 (నిఘా న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని శ్రీ పైళ్ల మల్లారెడ్డి సాధన నిర్మించిన శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం ను పురస్కరించుకొని విద్యార్థిని, విద్యార్థులు కళాశాల ప్రిన్సిపాల్ ను మరియు అధ్యాపకులను ఘనంగా శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్య అనేది ప్రతి విద్యార్థిని ఇప్పుడు ఉన్న స్థాయి నుండి ఉన్నత స్థాయిలో నిలబెడుతుందని అలాంటి విద్యను నేర్పే ఉపాధ్యాయులను మరియు తల్లిదండ్రులను గౌరవించాలని, విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ పరుశరాములు, హనీఫ్, వెంకటాచారి, మురళి,విజయ్ కుమార్, సురేష్, బిక్షం,స్వప్న, సైదా, రవి, కృష్ణ,గణేష్ కు మార్ , గోపి, మృదుల,ఆనంద్ తదితరులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రిటైర్డ్ ఉపాధ్యాయులకు సన్మానం



**వలిగొండ సెప్టెంబర్ 05 (సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలో శ్రీ వెంకటేశ్వర కాలనీ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా కాలనీలోని రిటైర్ ఉద్యోగస్తులు మారోజు విష్ణుమూర్తి చిలుముల మల్లారెడ్డి మారోజు పోషణ చారి గౌరవ అధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి మరియు కాలనీ అధ్యక్షులు భీమీడి యాదిరెడ్డి ఆధ్వర్యంలో కాలనీ కమిటీ సభ్యులు వారిని సన్మానించడం జరిగింది. తదనంతరం కాలనీలోని కమ్యూనిటీ హాల్ నిర్మాణం ను పర్యవేక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సేవలు అభినందనీయం :

### జమాత్ ఇస్లా మీ హింద్ మహిళా విభాగం




**ఖమ్మం, సెప్టెంబర్ 5 : ( సమయం న్యూస్ )** ఉపాధ్యాయుల సేవలను, వారి త్యాగాలను స్మరించుకుంటూ శనివారం టీచర్స్ డే సందర్భంగా జమాత్ ఇస్లామీ హింద్ ఖమ్మం నార్త్ ఆధ్వర్యంలో మహిళా విభాగం పలు పాఠశాలలను సందర్శించి, ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛాలు, బహుమతులు అందజేసి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల, సెంచరీ స్కూల్, సిటిజన్ స్కూల్, బల్లేపల్లి ప్రభుత్వ పాఠశాల, ఖానాపురం ప్రభుత్వ పాఠశాల, ఇంద్రానగర్ ప్రభుత్వ పాఠశాల తదితర పాఠశాలలను మహిళా విభాగం ప్రతినిధులు సందర్శించారు. ఈ సందర్భంగా మహిళా విభాగం ప్రతినిధులు మాట్లాడుతూ, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైనదని పేర్కొన్నారు. విద్యార్థులకు కేవలం విద్యను అందించడమే కాకుండా, వారిలో క్రమశిక్షణ, విలువలు, బాధ్యతాయుతమైన పౌరసత్వ భావనలను పెంపొందించడంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో ఖమ్మం నార్త్ అధ్యక్షురాలు హుస్సైన్నీ , సబీహా, హాఫీజా, తన్వీర్, తబస్సుమ్, సీమా, సాజిదా, ఆఫియా, ఫాతిమా, జబీన్ తదితరులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వర న్యాయం

- జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి
- రాజీ మార్గమే రాజమార్గం: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS



**నారాయణపేట, సెప్టెంబర్,05(సమయం న్యూస్)**
నారాయణపేట జిల్లాలోని నారాయణపేట, కోస్గి, మక్తల్ కోర్టులలో ఈ నెల 12వ తేదీ శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS కోరారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... లోక్ అదాలత్ ద్వారా రాజీ పడదగిన కేసులను ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. కోర్టులలో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న వివాదాలను ఇరువర్గాలు పరస్పర అవగాహనతో రాజీ చేసుకుని సత్వర పరిష్కారం పొందవచ్చన్నారు.లోక్ అదాలత్‌లో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన వివాదాలు, కుటుంబ మరియు వైవాహిక వివాదాలు, బ్యాంకు రికవరీ కేసులు, సైబర్ కేసులు, విద్యుత్ చౌర్యానికి సంబంధించిన కేసులు, చెక్ బౌన్స్ కేసులు తదితర రాజీ పడదగిన కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు.చిన్నచిన్న వివాదాలను పెద్దవిగా మార్చుకుని కక్షలు పెంచుకోవడం వల్ల ఇరువర్గాల వారికి సమయం, ధనం వృథా కావడంతో పాటు మానసిక ఒత్తిడి కూడా ఏర్పడుతుందని ఎస్పీ పేర్కొన్నారు. అందువల్ల పరస్పర చర్చలు, రాజీ ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడం ద్వారా స్నేహపూర్వక వాతావరణాన్ని కొనసాగించవచ్చన్నారు."రాజీ మార్గమే రాజమార్గం" అనే విషయాన్ని ప్రజలు గుర్తించి, న్యాయశాఖ కల్పించిన జాతీయ లోక్ అదాలత్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివాదాలకు త్వరితగతిన పరిష్కారం పొందాలని ఎస్పీ సూచించారు.జిల్లాలోని పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి, సంబంధిత ఇరువర్గాల వారిని సంప్రదించి కౌన్సిలింగ్ నిర్వహిస్తూ లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారానికి అవగాహన కల్పిస్తారని తెలిపారు. తమ కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకోవాలనుకునే వారు సంబంధిత పోలీస్ అధికారులు లేదా కోర్టు విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వర న్యాయం అందడంతో పాటు ఇరువర్గాల మధ్య వివాదాలకు సామరస్యపూర్వక పరిష్కారం లభిస్తుందని ఎస్పీ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకుని ప్రశాంతమైన జీవితాన్ని కొనసాగించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# మాటలు రాని మనసులకు.. గురువే భాష..

- స్పందన ఆశ్రమంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు... డా.కే.అనితా రెడ్డి
- ప్రత్యేక పిల్లల జీవితాల్లో జ్ఞానజ్యోతులు గురువులు... నాయిని నీలిమ రాజేందర్ రెడ్డి
- ప్రేమతో పాఠాలు.. ఓర్పుతో జీవిత పాఠాలు




**హనుమకొండ, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్) :** ఒక సామాన్యుడిని సమాజం గర్వించే గొప్ప వ్యక్తిగా తీర్చిదిద్దేది ఒక్క గురువు మాత్రమేనని కాకతీయ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యురాలు, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితారెడ్డి, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సతీమణి నాయిని నీలిమ అన్నారు. అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ సర్క్యూట్ గెస్ట్‌హౌస్ సమీపంలోని స్పందన మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో శుక్రవారం టీచర్స్ డే వేడుకలు నిర్వహించారు. డాక్టర్ అనితారెడ్డి, నాయిని నీలిమ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆశ్రమంలోని ఉపాధ్యాయులను అతిథులు ఘనంగా సన్మానించి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఆశ్రమంలోని పిల్లలు ఆటపాటలతో అలరించారు. అనంతరం వారికి పుస్తకాలు, స్టేషనరీ, మిఠాయిలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితారెడ్డి, నాయిని నీలిమ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని అన్నారు. ఐఏఎస్, ఐపీఎస్, వైద్యులు, న్యాయవాదులు, రాజకీయ నాయకులు సహా ఏ రంగంలో ఉన్నత స్థాయికి ఎదిగిన వారైనా ఒకప్పుడు గురువుకు శిష్యులేనని గుర్తుచేశారు. ప్రపంచానికి దిశానిర్దేశం చేయగల వ్యక్తులను తీర్చిదిద్దే శక్తి ఉపాధ్యాయులకే ఉందన్నారు. ప్రతి వ్యక్తి జీవితంలో గురువుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. స్పందన ఆశ్రమంలోని ఉపాధ్యాయుల సేవలు మరింత ప్రత్యేకమైనవని వారు కొనియాడారు. ప్రత్యేక అవసరాలున్న, వినికిడి లోపం ఉన్న పిల్లలకు బోధించడం ఎంతో ఓర్పు, సహనం, ప్రేమతో కూడుకున్న సవాలుతో కూడిన బాధ్యత అని అన్నారు. అలాంటి పిల్లల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఉపాధ్యాయులను సన్మానించడం ద్వారా వారి సేవలకు గౌరవం ఇచ్చినట్లవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అనురాగ్ హెల్పింగ్ సొసైటీ నిర్వాహకులు సుచరిత, వసుధ, హరిత, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ అనామలీస్, నో మ్యాపింగ్ఓటర్ల కు నోటీసులు జారీ చేయాలి

- ఈ నెల 5, 6, 12, 13 తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్
- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సంగీత



**సంగారెడ్డి, సెప్టెంబర్ 5:( సమయం న్యూస్)** ఓటర్ల జాబితాలో గుర్తించిన అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లకు ఆలస్యం చేయకుండా నోటీసులు జారీ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సంగీత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు బూత్ లెవల్ అధికారులు నోటీసుల్లో విచారణ స్థలం, తేదీ, సమయాన్ని స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు లేదా వారి కుటుంబ సభ్యులు అవసరమైన పత్రాలతో విచారణకు హాజరై వివరాలు సమర్పించవచ్చన్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్ )లో భాగంగా సెప్టెంబర్ 5, 6, 12, 13 తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా రోజుల్లో బీఎల్ఓలు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఓటర్లు ముసాయిదా జాబితాలో తమ పేరు, చిరునామా తదితర వివరాలను పరిశీలించుకొని, తప్పులు ఉంటే నిర్ణీత ఫారాల ద్వారా సవరణలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాలను ఈఆర్ఓ, ఏఈఆర్ఓ కార్యాలయాల్లోనూ సమర్పించవచ్చన్నారు. సమావేశంలో సంగారెడ్డి ఆర్డీఓ రాజేందర్, ఈఆర్ఓలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

# వర్షపు నీటి నిలువ పనులను పరిశీలన

### జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి. టి నాగిరెడ్డి.



**వలిగొండ సెప్టెంబర్ 05 (సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని పహిల్వాన్ పూర్ గ్రామంలో బద్దం జోష్ణ రెడ్డి వ్యవసాయ భూమిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఇజిఎస్) ద్వారా చేపట్టిన ఫారం పాండ్ పనులను జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి టి. నాగిరెడ్డి శనివారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఫారం పాండ్ నిర్మాణ పనుల పురోగతి, పనుల నాణ్యత, కూలీలకు కల్పిస్తున్న ఉపాధి తదితర అంశాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల్లో పాల్గొంటున్న కూలీలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, పనికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫారం పాండ్ నిర్మాణం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకోవడంతో పాటు భూగర్భ జలాల అభివృద్ధికి, వ్యవసాయానికి నీటి లభ్యత పెంపునకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. చేపట్టిన పనుల పురోగతి, నాణ్యత పట్ల జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి టి. నాగిరెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. పనులను నిర్దేశిత ప్రమాణాల ప్రకారం నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో పరశురాములు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ విక్రమ్, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసు, ఫీల్డ్ అసిస్టెంట్ విజయ, గ్రామ పంచాయతీ కార్యదర్శి స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేది ఉపాధ్యాయులే

### సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పది-సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు.

**యాలాల మండలం, సెప్టెంబర్,05(సమయం న్యూస్)** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా దేవనూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయ,ఉపాధ్యాయినిలకు సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు మాట్లాడుతూ గురువు లేని విద్య గుడ్డి దీపం లాంటిది. విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేది ఉపాధ్యాయులే. సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ఎంతో గొప్ప స్థానం ఉంద ని అన్నారు.డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం మనందరికీ గర్వకారణం. పిల్లలను సన్మార్గంలో నడిపిస్తూ, వారిని ఉన్నత శిఖరాలకు చేర్చడంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిది" అని సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు కొనియాడారు.అనంతరం పాఠశాలలోని ఉపాధ్యాయులను శాలువాలతో, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. అలాగే అంగన్వాడీ టీచర్స్, మరియు పాఠశాలను పరిశుభ్రంగా ఉంచే పారిశుద్ధ్య కార్మికులకు కూడా సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మరియు మాజీ ఏఎంసీ డైరెక్టర్ మంత్రి వెంకటయ్య, యువ నాయకులు మెట్లి కృష్ణ, కిరణ్ కుమార్, బోడ్కా మల్లేశం,వి. గోపాల్, సూర్య ప్రకాష్, మెట్లి నరేష్, సురేష్ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.




# క్రికెట్ పిచ్‌పై భారత్-జపాన్ దోస్తానా!

**టోక్యో, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్):** భారత్, జపాన్ దేశాల మధ్య 75 సంవత్సరాల ద్వైపాక్షిక దౌత్య సంబంధాల వేడుకల సందర్భంగా ఇరుదేశాల పురుషుల జట్లు ప్రత్యేక అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లో తలపడనున్నాయి. ఈ చారిత్రాత్మక పోరు కోసం 'సుజుకి కప్' నిర్వహించనున్నట్లు జపాన్ క్రికెట్ అసోసియేషన్, బిసిసిఐ సంయుక్తంగా అధికారికంగా ప్రకటించాయి. జపాన్‌లోని తోచిగి ప్రిఫెక్చర్‌లో ఉన్న సానో ఇంటర్నేషనల్ క్రికెట్ గ్రౌండ్ వేదికగా సెప్టెంబర్ 22న ఈ మ్యాచ్ జరగనుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని సనాయ్ తకాఇచిల మధ్య జరిగిన ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశంలో కుదిరిన ఒప్పందం మేరకు 'స్పోర్ట్స్ 75' పేరుతో ఈ క్రీడా సంబంధాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 2036 ఒలింపిక్స్, పారాలింపిక్స్ ఆతిథ్య హక్కుల కోసం భారత్ చేస్తున్న ప్రయత్నాలకు కూడా ఈ భాగస్వామ్యం ఊతమివ్వనుంది. అదే సమయంలో జపాన్ వేదికగా జరిగే ఆసియా గేమ్స్‌లో పాల్గొనే భారత పురుషుల జట్టులోని స్టార్ క్రికెటర్లు వైభవ్ సూర్యవంశీ, శ్రేయస్ అయ్యర్ వంటి ఆటగాళ్లు ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగనున్నారు. ఈ సందర్భంగా బిసిసిఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పందిస్తూ.. ఈ అరుదైన మ్యాచ్‌లో భాగస్వామి కావడం బిసిసిఐకి ఎంతో సంతోషాన్ని ఇస్తోందని, తూర్పు ఆసియా ప్రాంతంలో క్రికెట్‌ను మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి ఇదొక గొప్ప అవకాశమని పేర్కొన్నారు. జపాన్ క్రికెట్ అసోసియేషన్ సీఈఓ నవోకి అలెక్స్ మియాజీ మాట్లాడుతూ.. ప్రపంచ ఛాంపియన్ జట్టును తమ దేశంలో ఆహ్వానించడం గర్వంగా ఉందన్నారు. ఈ మ్యాచ్ ద్వారా ఈస్ట్ ఆసియా మార్కెట్‌లో క్రికెట్ క్రేజ్ పెంచడంతో పాటు, జపాన్‌లో క్రికెట్ మౌలిక వసతుల అభివృద్ధికి బిసిసిఐ సాంకేతిక సహకారాన్ని కూడా అందించనుంది.




# పాకిస్థాన్ టీమ్‌లో 'ఆపరేషన్ క్లీన్-అప్'!

**లండన్, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్):** ఇంగ్లాండ్ దెబ్బకు పాకిస్థాన్ క్రికెట్‌లో భారీ భూకంపం సంభవించింది! లార్డ్స్ మైదానంలో జరిగిన రెండో టెస్టులో 194 పరుగుల తేడాతో దారుణ పరాజయం చవిచూడటంతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఆగ్రహంతో ఊగిపోతోంది. ఈ అవమానకర ఓటమితో సీరియస్ అయిన బోర్డు, సిరీస్ మధ్యలోనే ఏకంగా ఏడుగురు సీనియర్ ప్లేయర్లపై నిర్దాక్షిణ్యంగా వేటు వేసింది. జట్టు నుంచి తొలగించిన వారిలో మహమ్మద్ రిజ్వాన్, ఇమామ్-ఉల్-హక్, సల్మాన్ అలీ ఆఘా, అలీ ఉస్మాన్, అమీర్ జమాల్, అవైస్ జాఫర్, ఖుర్రమ్ షెహజాద్ ఉన్నారు. ఫ్లాప్ ఫార్మ్‌లో ఉన్న సీనియర్లను పక్కనబెట్టి సైమ్ అయూబ్, అబ్దుల్లా షఫీక్‌లతో పాటు అర్బాత్ మిన్హాస్, మహమ్మద్ ఇమ్రాన్ జూనియర్, సాద్ బేగ్, మహమ్మద్ ఇమ్రాన్, రజావుల్లా వంటి ఐదుగురు యంగ్ ప్లేయర్లకు తొలిసారి అవకాశం ఇచ్చారు. ఆటగాళ్లతో పాటు హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌లను కూడా పదవుల నుంచి ఊడబీకి సరికొత్త డ్రామాకు తెరతీశారు. మైక్ హెస్సన్, యాసిర్ అరఫాత్‌లకు ఈ పర్యటన ముగిసేవరకు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికే 0-2తో సిరీస్ కోల్పోయిన పాక్, సెప్టెంబర్ 9 నుంచి జరగబోయే మూడో టెస్టులోనైనా పరువు కాపాడుకుంటుందో లేదో చూడాలి.




# సీఎస్కే కెప్టెన్ మార్పు తప్పదా!

**చెన్నై, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్):** ఇండియన్ ప్రీమియర్ లీగ్ అత్యంత విజయవంతమైన ఫ్రాంచైజీలలో ఒకటైన చెన్నై సూపర్ కింగ్స్ రాబోయే సీజన్ కోసం సంచలనాత్మక నిర్ణయాలు తీసుకోబోతున్నట్లు తెలుస్తోంది. గత కొన్ని సీజన్లుగా జట్టు ఆశించిన స్థాయిలో రాణించలేకపోవడంతో, మేనేజ్‌మెంట్ జట్టు నాయకత్వంలో మార్పులు చేసేందుకు తీవ్రంగా యోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా, ప్రస్తుత సారథి రుతురాజ్ గైక్వాడ్‌ను కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించి, ఆ స్థానాన్ని వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్‌కు అప్పగించాలని అనేకమంది క్రికెట్ విశ్లేషకులు మరియు మాజీ ఆటగాళ్లు సూచిస్తున్నారు. చెన్నై సూపర్ కింగ్స్ చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా వరుసగా మూడేళ్లపాటు ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించడంలో విఫలమైంది. ఇది ఫ్రాంచైజీ యాజమాన్యంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్ల మంది అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. గత 2026 ఐపీఎల్ సీజన్‌లో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ వ్యక్తిగత ప్రదర్శన కూడా జట్టుకు ఏమాత్రం కలసి రాలేదు. ఆయన కేవలం 28 సగటుతో 337 పరుగులు మాత్రమే చేసి తీవ్రంగా విఫలమయ్యారు. కెప్టెన్సీ ఒత్తిడి కారణంగానే ఆయన బ్యాటింగ్ తీవ్రంగా ప్రభావితమైందనే విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో, మినీ వేలం లేదా ట్రేడింగ్ ద్వారా జట్టులోకి వచ్చిన సంజూ శాంసన్‌కు నాయకత్వ పగ్గాలు అప్పగిస్తే జట్టు పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సంజూ శాంసన్‌కు ఐపీఎల్‌లో సారథిగా మంచి అనుభవం ఉందనేది స్పష్టమవుతోంది. రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆయన ఏకంగా 66 మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యవహరించారు. అందులో 50 శాతానికి పైగా గెలుపు శాతాన్ని నమోదు చేయడమే కాకుండా, తన సమర్థవంతమైన నాయకత్వంతో రాజస్థాన్ జట్టును ఫైనల్‌కు కూడా తీసుకెళ్లారు. ఒత్తిడిలోనూ ప్రశాంతంగా నిర్ణయాలు తీసుకోవడం, యంగ్ ప్లేయర్లను సరిగ్గా ప్రోత్సహించడం సంజూ శాంసన్ ప్రత్యేకత. తమిళనాడుకు చెందిన మాజీ క్రికెటర్ సుబ్రమణ్యం బద్రీనాథ్ సైతం ఈ అంశంపై స్పందిస్తూ.. రుతురాజ్ గైక్వాడ్‌పై నుంచి కెప్టెన్సీ భారాన్ని తొలగిస్తే, ఆయన ఓపెనర్‌గా ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా బ్యాటింగ్ చేయగలరని వ్యాఖ్యానించారు. చెన్నై జట్టుకు రుతురాజ్ అత్యంత కీలకమైన బ్యాటర్ అని, కెప్టెన్సీ భారం వల్ల ఆయన నాణ్యమైన ఆటను కోల్పోకూడదని బద్రీనాథ్ పేర్కొన్నారు. ఇవే కాకుండా, సీఎస్కే తుది జట్టులో మరికొన్ని కీలక మార్పులు కూడా త్వరితగతిన చేపట్టాల్సిన అవసరం ఉందని తెలుస్తోంది. రాబోయే సీజన్ నాటికి జట్టులో మిడిల్ ఆర్డర్ బలాన్ని పెంచడంతో పాటు, డెత్ ఓవర్లలో నిలకడగా బౌలింగ్ చేసే పేసర్లను ఎంపిక చేసుకోవడంపై ఫ్రాంచైజీ దృష్టి సారించింది. సంజూ శాంసన్‌కు కెప్టెన్సీ ఇస్తే, అది సీఎస్కే భవిష్యత్తుకు సరికొత్త దిశను నిర్దేశిస్తుందని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి.



# మహమ్మద్ షమీని ధీటుగా ఎదుర్కొంటాం!

**చెన్నై, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్):** దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్ పోరు కోసం తాము అన్ని విధాలా సిద్ధమయ్యామని సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మ వెల్లడించాడు. సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ బౌలింగ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొంటామని ధీమా వ్యక్తం చేశాడు. ఆదివారం చెన్నై వేదికగా ప్రారంభమయ్యే ఈ కీలక ఫైనల్లో ఇషాన్ కిషన్ సారథ్యంలోని ఈస్ట్ జోన్‌తో సౌత్ జోన్ తలపడనుంది. శనివారం జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడిన తిలక్ వర్మ.. తమ జట్టు తరఫున కేఎల్ రాహుల్ ఆడటం లేదని స్పష్టం చేశాడు. అయితే దేవదత్ పడిక్కల్, మహమ్మద్ సిరాజ్‌లు బరిలోకి దిగుతున్నట్లు తెలిపాడు. "షమీ వేసే లైన్ అండ్ లెంగ్త్ బౌలింగ్‌ను తీవ్రంగా గమనించాం, దాన్ని సమర్థవంతంగా ఎదుర్కొని మా సత్తా చాటుతాం" అని తిలక్ అన్నాడు. కాగా, ఏకంగా 54 సంవత్సరాల తర్వాత దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్, ఈస్ట్ జోన్ ముఖాముఖి తలపడుతున్నాయి. చివరిసారిగా 1970-71 సీజన్‌లో బ్రాబోర్న్ స్టేడియంలో తలపడగా, ఆ మ్యాచ్‌లో సౌత్ జోన్ 10 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొత్తం మీద సౌత్ జోన్ ఫైనల్ చేరడం ఇది 24వ సారి కాగా, ఇప్పటివరకు 13 టైటిళ్లు గెలుచుకుంది. మరోవైపు 13 ఏళ్ల విరామం తర్వాత ఫైనల్ చేరిన ఈస్ట్ జోన్, ఇప్పటివరకు 8 సార్లు ఫైనల్స్ ఆడి 2 సార్లు మాత్రమే విజేతగా నిలిచింది. ఈ మ్యాచ్‌కు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ హాజరుకానున్నారు. అతని పదవీకాలం అక్టోబర్ 4 వరకు ఉన్నప్పటికీ, వచ్చే ఏడాది ప్రపంచకప్ వరకు పొడిగించే అవకాశం ఉందని తెలుస్తోంది. దీనిపై బిసిసిఐ కార్యదర్శి దేవజిత్ సైకియాతో సమావేశం జరగనుంది. అలాగే రాబోయే ఆసియా గేమ్స్ కోసం నెట్ బౌలర్లుగా మయాంక్ యాదవ్, కార్తీక్ త్యాగి, మొహ్సిన్ ఖాన్‌లకు అవకాశం లభించనుంది.



# యంగ్ పేసర్ ప్రిన్స్‌పై బిసిసిఐ ఫోకస్!

- జస్ప్రీత్ బుమ్రా కంబ్యాక్‌పై కొనసాగుతున్న సస్పెన్స్!
- బుమ్రా బ్యాకప్‌గా యంగ్ పేసర్ ప్రిన్స్!
- గాయాలతో సతమతమవుతున్న టీమిండియా కీలక ప్లేయర్లు!
- ఆటగాళ్లకు త్వరలో మ్యాచ్ సిమ్యులేషన్ టెస్టులు!
- ప్రపంచకప్ ముంగిట భయపెడుతున్న వరుస గాయాలు





**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్):** భారత క్రికెట్ జట్టు స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా మైదానంలోకి తిరిగి రావడంపై నెలకొన్న ఉత్కంఠకు ఇంకా తెరపడలేదు. గత కొంతకాలంగా మోకాలినొప్పితో బాధపడుతున్న బుమ్రా, ప్రస్తుతం ఫిట్‌నెస్ సాధించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అయితే, బిసిసిఐ (దీజజ×) మెడికల్ టీమ్ నుంచి ఆయనకు ఇప్పటివరకు పూర్తిస్థాయి ఫిట్‌నెస్ క్లియరెన్స్ లభించలేదు. రాబోయే అఫ్గానిస్థాన్ టి20 సిరీస్ అలాగే 2026 ఆసియా క్రీడల భారత స్క్వాడ్‌లో బుమ్రా పేరును చేర్చినప్పటికీ, ఆయన తుది జట్టులో ఆడటం అనేది కేవలం ఆయన ఆరోగ్య పరిస్థితి మరియు ఫిట్‌నెస్‌పైనే ఆధారపడి ఉంటుందని బోర్డు వర్గాలు స్పష్టం చేశాయి. జూలై 16న ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో వన్డే మ్యాచ్ తర్వాత బుమ్రా మళ్లీ పూర్తిస్థాయిలో బౌలింగ్ చేయలేదు. ఆయన కోలుకోవడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉండటంతో, బిసిసిఐ సెలెక్టర్లు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించారు. ఇందులో భాగంగానే యంగ్ ఫాస్ట్ బౌలర్ ప్రిన్స్ యాదవ్‌ను బుమ్రాకు బ్యాకప్ పేసర్‌గా పరిశీలిస్తున్నారు. దేశవాళీ క్రికెట్‌లో వరుసగా రాణిస్తున్న ప్రిన్స్ యాదవ్‌కు అవకాశం ఇస్తే, అంతర్జాతీయ స్థాయిలో ఆయన సేవలు ఉపయోగపడతాయని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. మరోవైపు, కేవలం బుమ్రా మాత్రమే కాకుండా భారత జట్టులోని మరికొందరు కీలక ఆటగాళు కూడా గాయాల బారిన పడటం జట్టు యంత్రాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణా, మరియు సాయి సుదర్శన్ ప్రస్తుతం గాయాల నుంచి కోలుకుంటున్నారు. వీరి ఫిట్‌నెస్‌ను కచ్చితంగా అంచనా వేసేందుకు నేషనల్ క్రికెట్ అకాడమీ (చీజూా) ఆధ్వర్యంలో వారం రోజుల పాటు ప్రత్యేక మ్యాచ్ సిమ్యులేషన్ టెస్టులను నిర్వహించనున్నారు. ఈ కఠినమైన పరీక్షల్లో ఫిట్‌నెస్ నిరూపించుకున్న ఆటగాళ్లు మాత్రమే సెప్టెంబర్ 10న ఢిల్లీ చేరుకునే భారత జట్టుతో కలిసి ప్రయాణిస్తారు. ఈ పరిణామాలపై భారత మాజీ క్రికెటర్ సుబ్రమణ్యం బద్రీనాథ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. బుమ్రా వంటి కీలక బౌలర్ తరచూ గాయాలపాలవడం జట్టు సమతుల్యతను దెబ్బతీస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ ఉన్న నేపథ్యంలో, ప్రధాన బౌలర్లు నిలకడైన ఫిట్‌నెస్‌తో ఉండటం చాలా అవసరమని పేర్కొన్నారు. ముఖ్యమైన టోర్నీలకు ముందు కీలక ఆటగాళ్లు దూరం కావడం అభిమానులతో పాటు జట్టు యాజమాన్యానికి పెద్ద సవాలుగా మారింది.



# తమన్నాకి ఆ హీరో ప్రపోజ్ చేసాడా?

**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్):** మిల్కీబ్యూటీ తమన్నా భాటియా ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకెళ్తున్నారు. ప్రధానంగా తన ఫోకస్‌ను హిందీ చిత్ర పరిశ్రమపైనే పెట్టారు. ఐటెం సాంగ్స్‌తో పాటు హీరోయిన్‌గానూ ఆమెకు అవకాశాలు క్యూకడుతున్నాయి. విజయ్ వర్మతో బ్రేకప్ తర్వాత కెరీర్, వ్యాపారాలపై సరికొత్త ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇదిలాఉండగా ఓ స్టార్ హీరో వేదిక మీదే తమన్నాకు ప్రపోజ్ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. లస్ట్ స్టోరీస్ 2 సమయంలో తన సహనటుడు విజయ్ వర్మతో తమన్నాకి ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఇద్దరూ కొన్నాళ్లు సీక్రెట్‌గా డేటింగ్ చేశారు. సినిమా ఫంక్షన్లు, ఈవెంట్స్, విహారయాత్రలతో తమన్నా – విజయ్ హల్‌చల్ చేశారు. కానీ ఎక్కడా కూడా తమ బంధాన్ని బయటపెట్టలేదు. ఆ తర్వాత నెమ్మదిగా ఇద్దరూ ఓపెన్ అయ్యారు. రేపో మాపో పెళ్లి అనుకుంటుండగా తమన్నా – విజయ్ వర్మలు అనూహ్యంగా విడిపోయారు. వీరి మధ్య బ్రేకప్‌కు దారి తీసిన కారణాలు ఏంటన్నది మాత్రం తెలియరాలేదు. కెరీర్‌లో నిలదొక్కుకోవాలని విజయ్ వర్మ.. పెళ్లి చేసుకుని జీవితంలో స్థిరపడాలని తమన్నా నిర్ణయించుకోవడమే ఇందుకు ప్రధాన కారణంగా బాలీవుడ్ మీడియా కోడై కూసింది. బ్రేకప్ తర్వాత తమన్నా– విజయ్‌లు వారి జీవితాల్లో బిజీ అయ్యారు. సినిమాలు, షూటింగ్స్, బిజినెస్ ఇతర వ్యవహారాల్లో తలమునకలయ్యారు. ఈ బాధ నుంచి బయటకు రావడానికి సినిమాలను పెంచారు తమన్నా. అలాగే ఇప్పటి వరకు గ్లామరస్ రోల్స్ చేసిన నో కిస్ రూల్‌ను పక్కాగా ఫాలో అయిన ఈ ముద్దుగుమ్మ.. ఈ నిబంధనను కూడా పక్కనపెట్టారు. ఇంటిమేట్ సీన్స్, బెడ్ సీన్స్‌లో నటించేందుకు ఎలాంటి అభ్యంతరం లేదన్నట్లుగా సంకేతాలు ఇచ్చారు. దీనికి తగినట్లుగానే రాగిణి ఎంఎంస్ 3 వంటి బోల్డ్ సినిమాలో నటించేందుకు అగ్రిమెంట్ మీద సంతకం చేసింది. ప్రస్తుతం తమిళంలో పురుషన్, హిందీలో వీవాన్ ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్, వీ శాంతారామ్ బయోపిక్, రోహిత్ శెట్టి, జగన్ శక్తిలు తెరకెక్కించనున్న సినిమాలలో తమన్నా నటిస్తున్నారు. ఇవి కాకుండా మరిన్ని ప్రాజెక్టులు చర్చల దశలో ఉన్నాయి. అన్నింటిలోకి సిద్ధార్థ్ మల్హోత్రా సరసన నటిస్తోన్న వీవాన్ ఫోర్స్ ది ఫారెస్ట్ ముందు రిలీజయ్యే అవకాశం ఉంది. తాజాగా కృష్ణాష్టమిని పురస్కరించుకుని ఈ సినిమాలోని సమఝోనా అనే పాటను విడుదల చేశారు. ఈ సాంగ్ లాంచ్ కార్యక్రమం శుక్రవారం ముంబైలో జరిగింది. ఈ సందర్భంగా సిద్ధార్థ్– తమన్నాల కెమెస్ట్రీ అదిరిపోయింది. సమజోనా పాటను పాడుతూ.. మోకాళ్లపై కూర్చొని తమన్నాకు ప్రపోజ్ చేస్తున్నట్లుగా సిద్ధార్థ్ ఉండగా.. మిల్కీబ్యూటీ చిరునవ్వులు చిందిస్తూ సిగ్గుపడింది. అలాగే షూటింగ్ సమయంలో జరిగిన కొన్ని సంఘటనలను సిద్ధార్థ్ పంచుకున్నారు.

# 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్' ట్రైలర్ రిలీజ్

'బేబీ' మూవీ సక్సెస్ తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా రాబోతున్న కొత్త సినిమా 'ఎపిక్ -- ఫస్ట్ సెమిస్టర్'. ఈ యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ కి ఆదిత్య హాసన్ దర్శకత్వం వహిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై ఎస్. నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 11న ఈ మూవీ రిలీజ్ కానున్న నేపథ్యంలో తాజాగా చిత్ర ట్రైలర్ రిలీజ్ చేసి సినిమాపై అంచనాలు పెంచారు.






# 200 కోట్ల క్లబ్‌లో రవితేజ 'ఇరుముడి'

**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్):** మాస్ మహరాజ్ రవితేజ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఇరుముడి'. శివ నిర్వాణ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించింది. ఈ చిత్రం విడుదలైన తొలి రోజు నుంచే హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఫలితంగా ఈ చిత్రం రూ.200 కోట్ల వసూళ్లను రాబట్టినట్టు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. అయితే, ఈ చిత్రం ఇంతటి భారీ విజయానికి గల కారణాలను పరిశీలిస్తే, ఎక్కువగా మాస్ యాంగిల్‌లో కనిపించే రవితేజ ఇందులో భిన్నమైన పాత్రలో కనిపించారు. సాధారణ మధ్యతరగతి తండ్రి (త్రినాథ్)గా కనిపించారు. కూతురి ప్రేమకోసం పరితపించే తండ్రిగా భావోద్వేగభరితమైన నటనతో ఆకట్టుకున్నారు. ఆయన అభినయం విమర్శకుల ప్రశంసలు అందుకుంది. తెలుగు ప్రజలకు, ముఖ్యంగా అయ్యప్ప స్వామి భక్తులకు బాగా తెలిసిన ఇరుముడి దీక్ష గురించి ఈ సినిమాలో చూపించారు. ఈ అంశం ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయింది. తన ప్రాణమైన కూతురు మణెమ్మ (బేబీ నక్షత్ర) కోసం రవితేజ 41 రోజుల అయ్యప్ప దీక్షను స్వీకరిస్తారు. ఆ దీక్ష ఆయన జీవితాన్ని ఎలా మార్చిందనేది కథలో కీలకమైన అంశం. ఈ రెండు అంశాలకు తోడు సెంటిమెంట్‌తో పాటు ఊహించని మలుపులు, క్లైమాక్స్ ట్విస్ట్ ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేశాయి. ఇది కూడా సినిమా విజయానికి ఓ కారణంగా చెప్పొచ్చు. అలాగే, ఓ తండ్రిగా తన కూతురిపై ప్రేమ చూపించడమే కాదు, సమాజంలో అమ్మాయిలకు జరిగే అన్యాయాలకు వ్యతిరేకంగా హీరో పోరాటం చేయడం కూడా ప్రేక్షకులను కదిలించింది. ఇతపోతే, చివరగా తెలుగు ప్రజలకు బాగా సుపరిచితమైన 'మల్లెపూల పల్లకి' పాటను ఈ సినిమాలో చూపించడం ప్లస్ పాయింట్. అభిమానులు ఆ పాటకు థియేటర్లలో భజనలు చేశారు. 'యాలాలో.. యాలాలో', 'కార్తీకమాసం' పాటలూ ఆకట్టుకున్నాయి. ఇలా అన్ని అంశాలు కలిసిరావడంతో ఈ చిత్రం బ్లాక్ బస్టర్ హిట్ మూవీగా నిలిచింది.

# 'డెలులు' సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి

**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్):** ప్రస్తుతం యువతలో బాగా ట్రెండ్ అవుతున్న 'డెలులు' అనే పదమే టైటిల్‌గా తెరకెక్కుతున్న చిత్రం 'డెలులు'. క్రియేటివ్ లాంచ్‌ప్యాడ్ బ్యానర్‌పై సంకీర్త్ కొండ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ప్రీతం కస్తూరి దర్శకత్వం వహిస్తున్నారు. విజయ్ రాజ్‌కుమార్ కథ, అదనపు సంభాషణలు అందించగా.. రెష్మిత్ ఎస్. కౌశిక స్క్రీన్‌ప్లే, సంభాషణలు రాశారు. టైటిల్ నుంచే విభిన్నంగా అనిపిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. యువతరం నటీనటులతో తెరకెక్కుతున్న 'డెలులు' మూవీ టీజర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఒక నిమిషం 32 సెకండ్ల నిడివి ఉన్న ఈ టీజర్.. 'బ్రేకప్ దేవా' అనే డైలాగ్‌తో ప్రారంభమవుతుంది. ఆ తర్వాత వచ్చే సన్నివేశాలు, పాత్రల మధ్య జరిగే సరదా సంభాషణలు టీజర్‌కు మంచి ఫన్ టచ్‌ను తీసుకొచ్చాయి. టీజర్‌లోని పలు డైలాగ్స్ ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. 'ఆడదానివైన నువ్వు.. చీప్‌గా ఓ మగాడి కోసం మారతావా అంటావా.. సెల్ఫ్ రెస్పెక్ట్ లేదా నీకు', 'నువ్వేమైనా ఫాదర్ ఆఫ్ ఇండియానా?', 'నువ్వు అత్తాపూర్‌కు రారా.. నీళ్ల ట్యాంకర్ దగ్గర ఆడోళ్లతో కొట్టిస్తా', 'కుక్కకు పుట్టినవా నువ్వు' వంటి డైలాగ్స్ టీజర్‌లో హైలైట్‌గా నిలిచాయి. ఈ డైలాగ్స్, కామెడీ సన్నివేశాలు సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచుతున్నాయి. ముఖ్యంగా ఓ ఇంటి నేపథ్యంలో చోటుచేసుకునే సరదా సంఘటనలు, పాత్రల మధ్య కెమిస్ట్రీ టీజర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. కామెడీతో పాటు కుటుంబ ప్రేక్షకులను అలరించే అంశాలకు కూడా సినిమాలో ప్రాధాన్యత ఇచ్చినట్లు టీజర్ చూస్తే అర్థమవుతోంది. మొత్తంగా టీజర్ ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతూ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించేలా ఉంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్‌కు మంచి స్పందన రాగా.. తాజాగా వచ్చిన టీజర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. సాంకేతికంగా కూడా 'డెలులు'కు మంచి బృందం పనిచేస్తోంది. జై రాజ్ నాయుడు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా.. హరికృష్ణ కురపాటి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆది చెబ్రోలు సంగీతం అందిస్తున్నారు. టీజర్‌లో సంగీతం కూడా సన్నివేశాలకు తగ్గట్టుగా ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంలో విజయ్ రాజ్‌కుమార్, వేణిరావు, అఖిల్ జాక్సన్, సాయి ప్రసన్న, శ్రీ రామ మండవ, అభినయ్ తుల తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. యువతను టార్గెట్ చేసే ఫన్, కామెడీ, ఎంటర్‌టైన్‌మెంట్ అంశాలతో 'డెలులు' చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. టీజర్‌కు వస్తున్న స్పందనతో 'డెలులు' సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. విభిన్నమైన టైటిల్, కామెడీతో కూడిన కథనం, ఫన్ ఎలిమెంట్స్ సినిమాకు ప్లస్‌గా మారే అవకాశముంది. ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా హీరో మాట్లాడుతూ.. నా సినిమాలో దమ్ము లేకుంటే విమ్ముకొని నిలబడ్డా ఎవ్వడూ చూడడు.. కాంట్రవర్సీలతో కాదు కంటెంట్ తో వస్తున్నాం. కేవలం కంటెంట్ బలంతోనే మా సినిమా నిలబడుతుంది కానీ ప్రమోషన్స్ లో ఎలాంటి కాంట్రవర్సీలకు పోయే ప్రసక్తే లేదు అని అన్నారు.




# మంచిగా ఉందామన్నా బతకనివ్వడం లేదు

**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్):** సాధారణ డిస్ట్రిబ్యూటర్‌గా కెరీర్ ప్రారంభించి.. నిర్మాతగా మారి ప్రస్తుతం టాలీవుడ్‌తో పాటు భారతీయ సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు దిల్‌రాజు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై 60కి పైగా సినిమాలు చేయడంతో పాటు ఎందరో హీరోలను, హీరోయిన్లను, దర్శకులను, ఇతర టెక్నీషియన్లను వెండితెరకు పరిచయం చేశారు రాజుగారు. దిల్‌రాజు బ్యానర్ నుంచి సినిమా వస్తుందంటే ఖచ్చితంగా దానిలో విశేషం ఉంటుందని ప్రేక్షకులు నమ్ముతారంటే చిత్ర పరిశ్రమపై ఆయన ఎలాంటి ముద్రవేశారో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. తెలుగు చిత్ర పరిశ్రమను శాసించే వ్యక్తుల్లో ఒకరిగా.. నైజాం కింగ్‌గా అభిమానులను దిల్‌రాజును పిలుచుకుంటారు. ఆయన మాటలు, చేతలు ఖచ్చితంగా ఇండస్ట్రీపై తీవ్ర ప్రభావం చూపుతాయి. దిల్‌రాజు ఓ ప్రాజెక్ట్ డీల్ చేస్తున్నారంటే ఖచ్చితంగా ఎన్నో లెక్కలు వేసుకుంటారని, ఆయన జడ్జిమెంట్ తప్పదని ఇండస్ట్రీ జనాల నమ్మకం. ఒక సినిమా రష్ చూసి అది ఎన్ని రోజులు ఆడుతుంది? ఎంత వసూలు చేస్తుంది? అనేది లెక్కలతో సహా చెప్పగల మేధావి దిల్‌రాజు. గత కొన్నేళ్ల వరకు ఆయన పట్టిందల్లా బంగారం అన్నట్లుగా సాగింది. స్టార్స్‌తో సినిమాలు తీసినా.. కొత్త వారిని పరిచయం చేసినా భారీ వసూళ్లతో బ్రాండ్ సొంతం చేసుకున్నారు దిల్‌రాజు. అయితే కొద్దికాలంగా రాజుగారి లెక్కలు తప్పుతున్నాయి. సినిమాల నిర్మాణంతో పాటు డిస్ట్రిబ్యూషన్ పరంగానూ భారీ నష్టాలు మూటకట్టుకుంటున్నారు. ఇటీవల టాక్సిక్ మూవీ ఆంధ్రా–నైజాం రైట్స్‌ని ఏకంగా 100 కోట్లకు పైగా వెచ్చించి సొంతం చేసుకున్నారు దిల్‌రాజు. యశ్ నటించిన ఈ సినిమా తొలిరోజు నుంచే డివైడ్ టాక్ తెచ్చుకుంది.



సినిమాలు, డిస్ట్రిబ్యూషన్ మాత్రమే కాదు.. తన సామ్రాజ్యంగా చెప్పుకునే నైజాంలోకి బడా నిర్మాతలు అడుగుపెట్టడంతో ఆయన కోట బీటలు వారుతోంది. ఎంతమంది వచ్చినా తన మార్క్ చూపిస్తూ, ఎన్ని కష్టాలు ఎదురైనా తట్టుకుని నిలబడుతున్నారు దిల్‌రాజు. ఈ జనరేషన్‌లో మోస్ట్ సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్‌గా ఘనత సాధించిన ఆయన.. గత కొంతకాలంగా ఇండస్ట్రీలో తీరుతెన్నులు... పెరిగిన ప్రొడక్షన్ ఖర్చులు తదితర అంశాలపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఓ సినిమా ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన దిల్‌రాజు షాకింగ్ కామెంట్స్ చేశారు. కోర్ట్ మూవీతో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న కొత్త కుర్రాడు హర్ష్ రోషన్ నటించిన లేటెస్ట్ మూవీ తెల్ల కాగితం. నక్షత్ర హీరోయిన్‌గా నటిస్తున్నారు. దీపక్, అజయ్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తుండగా.. రమేశ్ బండ్రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. అరుణాచల క్రియేషన్స్ బ్యానర్‌పై కృష్ణ కొమ్మాలపాటి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. నందు సవరిగాన కథ, స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందించారు. విజయ్ బుల్గాని సంగీత దర్శకత్వం వహించగా.. కేవీ గుహన్ సినిమాటోగ్రాఫర్‌గా, కార్తీక శ్రీనివాస్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తించారు. త్వరలోనే తెల్ల కాగితం మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌ను సెప్టెంబర్ 5వ తేదీన హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దిల్‌రాజ్ మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మీ జీవితం తెల్లకాగితం అయితే అందులో ఎర్ర మచ్చ ఏంటీ అని యాంకర్ స్రవంతి అడగ్గా.. దానికి దిల్‌రాజు స్పందించారు. ఎవరి జీవితంలోనూ తెల్ల కాగితం ఉండదు, జీవితంలో తెలిసి తెలియక అందరూ తప్పులు చేస్తుంటారు. తెల్ల కాగితం మీద ఎర్ర మచ్చ పడితే ఎలా ఉంటుందనేది ఈ సినిమా కథ. ఇప్పుడున్న సొసైటీలో మంచిగా ఉందామన్నా బతకనివ్వడం లేదు.. కాబట్టి వాళ్ల కోసమైనా మనం చెడుగా ఉండాల్సిందే. తెల్ల కాగితం టైటిల్‌కు ఇన్నోసెంట్ లవ్ అనే క్యాప్షన్ పెట్టమని చెప్పాను. ఈ స్టోరీ విన్నప్పుడు కొత్త బంగారం లోకం అనే సినిమాను 18 ఏళ్ల క్రితం తీసినప్పుడు ఎలా ఫీలయ్యానో అలాగే అనిపించింది. 2000వ సంవత్సరంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా ఈ తెల్ల కాగితం సినిమాను తీశారు. ఈ సినిమా మంచి హిట్ అవుతుందని ఆకాంక్షిస్తున్నా. ఈ సినిమాను చూజి ఈ తరం తమ జీవితంలో ఎర్ర మచ్చ పడకుండా జాగ్రత్త పడాలనేది ఈ కథ. మా కృష్ణతో నాది 20 ఏళ్ల జర్నీ.. ఎప్పుడూ ఏమీ అడగడు, అడిగినప్పుడు అండగా నిలబడాలి కదా? అని దిల్‌రాజు వ్యాఖ్యానించారు. ప్రస్తుతం దిల్‌రాజు వ్యాఖ్యలు చిత్ర పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారాయి.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **7036644111, 9490140565**

# విద్యుత్ కోతలను అరికట్టాలి

- 18 గంటల విద్యుత్ ను రైతాంగానికి అందించాలి.
- వలిగొండ సబ్ స్టే షన్ ముందు సిపిఎం ధర్నా.



**వలిగొండ సెప్టెంబర్ 05 (సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ విద్యుత్ కోతలను అరికట్టి గతంలో ఇచ్చిన విధంగా 18 గంటల కరెంటును రైతాంగానికి అందించాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. వలిగొండ మండల కేంద్రంలోని విద్యుత్ అధికారి కార్యాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన 18 గంటల విద్యుత్ ను 12 గంటల నుండి 8 గంటల లోపు తగ్గించిందని దీనివల్ల ప్రస్తుతం రైతుల వరి పంట పొట్టదశకు చేరుకున్న సమయంలో కంకి చేతి కిందనే పరిస్థితులు ఏర్పడతాయని దీనితో ధాన్యం దిగుబడి తక్కువగా వచ్చి రైతులకు తీవ్రంగా నష్టపోతారని వెంటనే గతంలో ఇచ్చిన మాదిరిగా 18 గంటల కరెంటును అందించాలని డిమాండ్ చేశారు. మండలంలో కొన్ని సబ్ స్టేషన్ ల పరిధిలోని కేవలం 7,8 గంటలకే పరిమితం చేస్తున్నారన్నారు. వెంటనే రైతాంగానికి నష్టం చేసే చర్యలకు స్వస్తి చెప్పి సరైన విద్యుత్తును అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కొండే కిష్టయ్య,కలుకూరి రామచందర్, భీమనబోయిన జంగయ్య,పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ,రైతు సంఘం నాయకులు మంగ బాలయ్య,కందగట్ల సాయి రెడ్డి, దయ్యాల మల్లేశం,చేగురి నరసింహ,కొండూరు సత్తయ్య,వట్టిపెల్లి చంద్రయ్య, ధ్యానబోయిన యాదగిరి, నారీ వెంకటేశం,పెద్దబోయిన భీమరాజు, దేశపాక రవి, నగేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమా.?

- ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు విడుదల చేయాలి.. జీవో 97 రద్దు చేయాలి
- ఓరుగల్లు గడ్డపై విద్యార్థుల పోరుబాట... దాస్యం వినయ్‌భాస్కర్
- విద్యార్థుల హక్కుల కోసం కదం తొక్కిన యువత



**హనుమకొండ, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్)** : ఫీజు రీయింబర్స్మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని, పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇబ్బందికరంగా మారిన జీవో 97ను తక్షణమే రద్దు చేయాలని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడొద్దని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన సందర్భంగా విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో శనివారం హనుమకొండలో భారీ నిరసన నిర్వహించారు. దాస్యం వినయ్భాస్కర్ ఆధ్వర్యంలో విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. హనుమకొండలోని ఏకశిలా పార్కు (ప్రొఫెసర్ జయశంకర్ సర్ స్మృతివనం) నుంచి కలెక్ట రేట్ వరకు ర్యాలీ చేపట్టా రు. చేతుల్లో ప్లకార్డులు, బ్యానర్లు పట్టు కుని 'ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు విడుదల చేయాలి', 'జీవో 97ను రద్దు చేయాలి' అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. అనంతరం కలెక్ట రేట్ వద్ద ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఫీజు రీయింబర్స్మెంట్ పథకం ఎంతో కీలకమన్నారు. నిధులు పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వెంటనే బకాయిలు విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు చెల్లింపులు, కళాశాలల్లో ప్రవేశాలు, పరీక్షలకు హాజరయ్యే విషయంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశాలను రాజకీయాలకు అతీతంగా పరిగణించి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో వ్యవహరించాలని సూచించారు.

**జీవో 97పై అభ్యంతరాలు పరిశీలించాలి...**

పాలిటెక్నిక్ విద్యార్థులకు సంబంధించిన జీవో 97ను వెంటనే రద్దు చేయాలని వినయ్‌భాస్కర్ డిమాండ్ చేశారు. జీవోపై విద్యార్థులు, విద్యావేత్తలు, సంబంధిత వర్గాల్లో ఉన్న అభ్యంతరాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. వారితో చర్చించి విద్యార్థుల ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. సాంకేతిక విద్యలో పాలిటెక్నిక్ విద్యకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని, వేలాది మంది విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం ఈ విద్యపై ఆధారపడుతున్నారని తెలిపారు. విద్యార్థులకు నష్టం కలిగించే నిర్ణయాలపై బీఆర్ఎస్ విద్యార్థు ల పక్షాన నిలిచి పోరాడుతుందని స్పష్ట ం చేశారు.

**అడ్డుకున్నా.. సంఘీభావం...**

నిరసన కార్యక్రమానికి తరలివస్తున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులను పోలీసులు అడ్డుకున్నారని నిర్వాహకులు తెలిపారు. అయినప్పటికీ విద్యార్థులు నిరసనకు సంఘీభావం ప్రకటించి ఉద్యమంలో భాగస్వాములయ్యారని పేర్కొన్నారు. విద్యార్థుల నినాదాలతో హనుమకొండ కలెక్టరేట్ పరిసరాలు మారోమ్రోగాయి. ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు విడుదల చేయాలని, జీవో 97ను రద్దు చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు, విద్యార్థి ప్రతినిధులు హనుమకొండ కలెక్టరేట్‌లో డీఆర్వోను కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని వినయ్‌భాస్కర్ తెలిపారు.

# శివాజీ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి..

- ఆరెపల్లిలో ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ.. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**వరంగల్ సెప్టె ంబర్ 5 (సమయం న్యూస్)** : ధర్మం, న్యాయం, స్వాభిమానానికి పెద్దపీట వేసి ప్రజల స్వేచ్ఛ కోసం పోరాడిన ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 3వ డివిజన్ ఆరేపల్లి గ్రామంలో ఛత్రపతి శివాజీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శనివారం ఆవిష్కరించారు. విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శివాజీ మహారాజ్ జీవితాన్ని కేవలం చరిత్రగా చూడకుండా, ఆయన పాటించిన విలువలను నేటి తరానికి ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ధర్మం, న్యాయం, స్వాభిమానం, ప్రజా సంక్షేమాన్ని పాలనకు ప్రాతిపదికగా చేసుకున్న శివాజీ ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. ప్రజల హక్కులు, స్వేచ్ఛ కోసం ఆయన సాగించిన పోరాటం తరతరాలకు స్ఫూర్తినిస్తుందని అన్నారు. ప్రజల కోసం పనిచేసే నాయకత్వం ఎలా ఉండాలో శివాజీ జీవితం చాటి చెబుతుందని, యువత ఆయన ధైర్యసాహసాలు, క్రమశిక్షణ, ప్రజాసేవా స్ఫూర్తిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఆరేపల్లిలో శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఉత్సవ కమిటీ సభ్యులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ సిందె రవీందర్, అరె సంక్షేమ సంఘం అధ్యక్షుడు చెట్టుపల్లి శివాజీ, మాజీ కార్పొరేటర్ జన్ను శోభారాణి అనిల్, మాజీ పీఏసీఎస్ చైర్మన్లు బుద్దె పెద్దన్న, బుద్దె శ్రీనివాస్, ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు సోమిడి అంజన్‌రావు, వరంగల్ జిల్లా అరె సంఘం అధ్యక్షుడు నర్సింగరావు, రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు చందర్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ బిక్షపతి, సీనియర్ నాయకులు మనోహర్, బిజిలి సంపత్, డివిజన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# సర్వేపల్లి స్ఫూర్తి.. భావితరాలకు దిక్సూచి..

- గురువే దేశ భవిష్యత్తుకు దారిచూపే దీపం...
- పైడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్‌కాంస్య విగ్రహం ఆవిష్కరించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు




**వరంగల్, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్)** : గొప్ప ఉపాధ్యాయుడి బోధన ఒక విద్యార్థి జీవితాన్నే కాదు దేశ భవిష్యత్తునే మార్చగలదని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ విద్యావేత్త డాక్ట ర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం ఇందుకు నిలువెత్తు నిదర్శనమన్నారు. గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ పైడిపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన రాధాకృష్ణన్ కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆవిష్కరించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాధాకృష్ణన్ ఆశయాలు, విద్యా సేవలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. లక్ష్య సాధనకు క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర కృషి ఎంతో అవసరమన్నారు. సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, వారు భావితరాలకు జ్ఞానంతో పాటు విలువలను అందించే మార్గదర్శకులని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జన్ను శోభారాణి అనిల్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ బుద్ద పెద్దన్న, సీనియర్ నాయకుడు బిజిలి సంపత్, డివిజన్ ముఖ్య నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీనివాసపురంలో భూముల రీ-సర్వే పరిశీలన

### రైతులు సహకరించాలి: తహశీల్దా ర్ ఆంజనేయులు



**ఆలేరు, సెప్టెంబరు 05(సమయం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే కార్యక్రమం శ్రీనివాసపురం గ్రామంలో నిర్వహించారు. ఆలేరు తహశీల్దార్ వలిగొండ ఆంజనేయులు శనివారం గ్రామంలో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా రీసర్వే పనుల పురోగతిని సర్వే సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ రైతులతో మాట్లాడిన తహశీల్దార్ భూముల రీ-సర్వే ప్రక్రియ సక్రమంగా పూర్తయ్యేందుకు రైతులందరూ అధికారులకు సహకరించాలని కోరారు. తమ భూములకు సంబంధించిన వివరాలను సర్వే సిబ్బందికి అందించి, రీ-సర్వే ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. శ్రీనివాసపురం గ్రామంలో ఇప్పటివరకు 215.16 ఎకరాల భూమికి రీసర్వే ప్రక్రియ పూర్తయినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన భూములకు కూడా సర్వే ప్రక్రియను నిర్దేశిత సమయంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ రోజన్ కుమార్‌తో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య...

### చౌల్ల పల్లి పాఠశాలలో విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**పరకాల/ఆత్మకూరు, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్) :** ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో నాణ్యమైన విద్య అందుతోందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఆత్మకూరు మండలం చౌల్లపల్లిలోని ప్రభుత్వ పాఠశాలను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని వసతులు, విద్యార్థుల చదువు, బోధన తీరును పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విద్యార్థులను భవిష్యత్ దేశ పౌరులుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అల్పాహార పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నామని, కార్పొరేట్ స్థాయి మౌలిక వసతులతో పాటు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, నాణ్యమైన ఉచిత విద్యను అందిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.

## ఘనంగా ప్రొ.కోదండరాం జన్మదిన వేడుకలు

### మదర్సా విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసిన టీజేఎస్ నాయకులు అంబటి శ్రీనివాస్ , షేక్ జావిద్



**నర్సంపేట, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్) :** తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం జన్మదిన వేడుకలను నర్సంపేటలోని మదర్సా దారుల్ మహబూబియాలో శనివారం ఘనంగా నిర్వహించారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జావిద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మదర్సా విద్యార్థులకు పంపిణీ చేశారు. కోదండరాం సార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన ప్రజా సేవలను, తెలంగాణ ఉద్యమంలో పోషించిన పాత్రను నాయకులు గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గుంటి రామచందర్, మహబూబ్ అలీ, సొల్తి సాయికుమార్, మహ్మద్ సందాని, సాంబరాజు మల్లేశం, మహ్మద్ రబ్బాని, మదర్సా ఉపాధ్యాయుడు ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

## గురువును ఘనంగా సత్కరించిన శిష్యులు

**ఆలేరు, సెప్టెంబరు 5సమయం న్యూస్):** ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆలేరు జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల 2001–02 బ్యాచ్ పూర్వ విద్యార్థులు తమ నాటి గురువు, రిటైర్డ్ హెడ్మాస్ట ర్ పటేల్ సుధాకర్‌రెడ్డి ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ సుధాకర్‌రెడ్డి తమకు విద్యాబోధన చేయడంతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, బాధ్యత, జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాల్సిన తీరును బోధించారని గుర్తు చేసుకున్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఆయన అందించిన మార్గదర్శకత్వం తమ జీవితాల్లో ఎంతో ప్రభావం చూపిందని పేర్కొన్నారు. తమ నాటి గురువు పట్ల ఉన్న గౌరవం, కృతజ్ఞతాభావాన్ని చాటుతూ పూర్వ విద్యార్థులు సుధాకర్‌రెడ్డి ని శాలువాతో ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ గురువుతో కలిసి తమ విద్యార్థి దశలోని అనుభవాలను పంచుకున్నారు.

# చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

- చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి
- ఉద్యోగుల హక్కుల సాధన కోసం ఐక్యంగా కదలాలి
- ఆలేరు ఎంపీడీవో కార్యాలయంలో పోస్టర్ఆవిష్కరణ



**ఆలేరు, సెప్టెంబరు 5(సమయం న్యూస్):** ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధన కోసం సెప్టెంబరు 10న హైదరాబాద్‌లో నిర్వహించనున్న చలో హైదరాబాద్, ఉద్యోగుల హక్కుల సాధన సభను విజయవంతం చేయాలని టి జి ఈ ఏ సి నాయకులు పిలుపునిచ్చారు. సంఘం జిల్లా చైర్మన్ మందడి ఉపేందర్‌రెడ్డి, జిల్లా సెక్రటరీ జనరల్ ధరణికోట భగత్‌ల సూచనల మేరకు చేపట్టిన జిల్లా ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలేరు మండల ఎంపీడీవో కార్యాలయంలో ప్రచార కార్యక్రమం నిర్వహించి, చలో హైదరాబాద్ పోస్ట ర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సత్య ఆంజనేయ ప్రసాద్, తహసీల్దార్ ఆంజనేయులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సంఘాలకు అతీతంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, కార్మికులు, పెన్షనర్లు ఐక్యంగా ముందుకు రావాలని కోరారు.

**ప్రధాన సమస్యల పరిష్కారానికి డిమాండ్**

పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయడంతో పాటు రెండో పీఆర్సీని అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఉద్యోగులు, పెన్షనర్లకు ఈహెచ్ఎస్ ద్వారా క్యాష్‌లెస్ వైద్యం అందించాలని కోరారు. పెండింగ్ బిల్లులను చెల్లించడంతో పాటు జీవో 317 బాధిత ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి ఆలేరు మండలంలోని అన్ని శాఖల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మనం అడిగేవి కానుకలు కావు, మనకు రావాల్సిన హక్కులు. హక్కుల సాధనకు ఉద్యోగుల ఐక్యతే బలం అని నాయకులు పేర్కొన్నారు. సంఘాలు వేరైనా, సమస్యలు ఒక్కటే ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అందరూ ఐక్యంగా ఉద్యమించాలని నాయకులు కోరారు. సెప్టెంబరు 10న హైదరాబాద్‌లో జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమానికి ఆలేరు మండలం నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టి జి ఈ ఏ సి జిల్లా కో-చైర్మన్ పెండెం శ్రీనివాస్, జిల్లా డిప్యూటీ సెక్రటరీ జనరల్ గణగాని శశికాంత్‌గౌడ్, పంచాయతీరాజ్ మినిస్టీ రియల్ రియల్ సంఘం అసోసియేట్ అధ్యక్షుడు పోలా గురునాథ్, ఆలేరు యూనిట్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, టీఎన్జీవో నాయకులు నల్లవెల్లి సునీల్‌కుమార్, కేంసారం ఆనంద్, బిళ్ల నాగసైదులు, ఎంపీవో అనురాధదేవి, కార్యాలయ పర్యవేక్షకురాలు హరితదేవి, ఆలేరు మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు సర్వన్‌నాయక్‌తో పాటు వివిధ శాఖల ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# చిన్నారి సిరివెన్నెలకు కన్నీటి వీడ్కోలు...

**మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించిన బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్**



**నల్లబెల్లి/వరంగల్, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్) :** విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన పిట్టల సిరివెన్నెల (14)కు పలువురు కన్నీటి నివాళులర్పించారు. నర్సంపేట నియోజకవర్గం నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన ముదిరాజ్ సంఘం నాయకుడు పిట్టల రమేష్ ముదిరాజ్ చిన్న కుమార్తె సిరివెన్నెల శనివారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు, నర్సంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ చిన్నారి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సిరివెన్నెల మృతి పట్ల బీసీ సంక్షేమ సంఘం తరపున సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు, నల్లబెల్లి మాజీ సర్పంచ్ గుండాల కుమారస్వామి ముదిరాజ్, గోనెల నరహరి, డ్యాగల శ్యామ్‌ప్రసాద్, బొడిగె సమ్మయ్య, మహేందర్, పిట్టల రామస్వామి, గద్దె రవి ముదిరాజ్, నల్లబెల్లి ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పాండవుల రాంబాబు ముదిరాజ్, పిట్టల రమేష్, నరేష్, డ్యాగల రమణమ్మ, డ్యాగల స్వరూప, డ్యాగల శారద, చింతల కళావతి, సార సరోజన, ముత్యాల సుశీల, పిట్టల కవిత తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ మల్కారం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కారుకొండ శ్రీకాంత్

**శంషాబాద్ సెప్టెంబర్ 5:** ఎమ్మార్పీఎస్ మల్కారం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కారుకొండ శ్రీకాంత్ ను నియమించినట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు రాచమల్ల చిట్టిబాబు తెలిపారు. శనివారం సాయంత్రం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కారుకొండ శ్రీకాంత్ ను ఎంపిక చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. మాదిగలకు జరుగుతున్న అన్యాయాలను ఎప్పటికప్పుడు పరిశీలించి వారికి న్యాయం చేసే విధంగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొత్తూరు రమేష్, రాచమల్ల రాజు, చిన్నగండు భాస్కర్, మాజీ వార్డు సభ్యుడు మైలారం శ్రీనివాస్, మల్కారం గ్రామ ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

- పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌విడుదల చేయాలి
- జాబ్‌క్యాలెండర్ ప్రకటించాలి.. యూత్ డిక్లరేషన్ హామీలు అమలు చేయాలి



**ఆలేరు, సెప్టెంబర్ 05(సమయం న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో యువత, విద్యార్థులకు ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆలేరు నియోజకవర్గ కేంద్రంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి గొంగిడి సునిత మహేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. సుమారు 2,000 మంది యువజనులు, విద్యార్థులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొని కాంగ్రెస్‌ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని, నిరుద్యోగులకు స్పష్టమైన జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించాలని, ఎన్నికల సమయంలో ప్రకటించిన యూత్ డిక్లరేషన్ హామీలను తక్షణమే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని వేలాది మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా విద్యార్థులు, వారి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాల భర్తీపై స్పష్టత ఇవ్వడంతో పాటు, ప్రతి ఏడాది ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేస్తారో తెలిపే విధంగా పక్కాగా జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. యువత, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడకుండా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్, టెస్కాబ్ మాజీ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్లూరి రామచంద్రరెడ్డితో పాటు అన్ని మండలాల యువజన అధ్యక్షులు, బీఆర్ఎస్వీ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యువత, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు.

# ఉపాధ్యాయుల సేవలు సమాజానికి మార్గదర్శకం

- విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది గురువులే
- ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం




**ఆలేరు, సెప్టెంబరు 05(సమయం న్యూస్):** ఉపాధ్యాయులు విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలను బోధించడమే కాకుండా, విలువలు, క్రమశిక్షణ, బాధ్యత, నైతికతను పెంపొందిస్తూ వారి భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నారని యాదాద్రి భువనగిరి జిల్లా జడ్పీ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చిలుకూరి శ్రీనివాస్ అన్నారు. సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆలేరులో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిలుకూరి శ్రీనివాస్ హాజరై పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చిలుకూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఒక మంచి ఉపాధ్యాయుడు వందలాది మంది విద్యార్థుల జీవితాలపై చెరగని ప్రభావం చూపగలడని అన్నారు. విద్యార్థులు తమ గురువులను గౌరవిస్తూ, వారు చూపిన సన్మార్గంలో పయనించి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైందని పేర్కొన్నారు.

**విద్యార్థుల భవిష్యత్తుకు శిల్పులు గురువులే**

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన బండిరాజుల శంకర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే శిల్పులు ఉపాధ్యాయులేనని అన్నారు. గురువులు అందిస్తున్న సేవలకు ఎంత గౌరవం ఇచ్చినా తక్కువేనని పేర్కొన్నారు. విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకున్న ప్రతి సందర్భంలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గుర్తు చేసుకోవాలని సూచించారు. విద్యతో పాటు మానవతా విలువలు, సామాజిక బాధ్యత, నైతికత వంటి అంశాలను విద్యార్థుల్లో పెంపొందించడంలో ఉపాధ్యాయులు మరింత కీలక పాత్ర పోషించాలని ఆయన అన్నారు. సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పులిప లుపుల మహేష్ మాట్లాడుతూ సమాజానికి సేవ చేయాలనే లక్ష్యంతో తమ సంస్థ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకులుగా నిలుస్తున్న ఉపాధ్యాయులను సన్మానించడం తమ సంస్థకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో విద్య, వైద్యం, సామాజిక సేవ తదితర రంగాల్లో మరిన్ని కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో కంతుల శంకర్, ఐలి సందీప్, కళ్లెం జితేందర్, మొరిగాడి సిద్దులు, గుండ్రజు నరసింహారాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ ప్రగతికి సమష్టి అడుగులు...

- 'కుడా' అభివృద్ధికి సమష్టి కృషి అవసరం
- చైర్‌పర్సన్ గుండు సుధారాణికి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**హన్మకొండ, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్) :** కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన గుండు సుధారాణి ప్రభాకర్ దంపతులను వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు శనివారం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. 'కుడా' కార్యాలయంలో వారికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరంగల్ నగరంతో పాటు కుడా పరిధిలోని ప్రాంతాల అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మౌలిక వసతుల కల్పన, పట్టణాభివృద్ధి పనులను మరింత వేగవంతం చేసేలా చర్యలు చేపట్టాలని ఆకాంక్షించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించి ముందుకు సాగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 45వ డివిజన్ అధ్యక్షుడు కర్ర హరీశ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ జన్ను శోభారాణి అనిల్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ బుద్దె పెద్దన్న, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# తుది జాబితా లో వుండే లక్ష్యంగా చర్యలు

- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్
- 1,75,858 మంది ఓటర్లకు ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారుల ద్వారా నోటీసులు
- ఎస్ ఐఆర్ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం



**ఖమ్మం, సెప్టెంబర్ 5 : ( సమయం న్యూస్ )** ముసాయిదా ఓటర్ల జాబితా లో ఉన్న ఓటర్లందరూ తమ ఓటు హక్కు పొందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్ట ర్ దివాకర టిఎస్ తెలిపారు. జిల్లా కలెక్టర్, ఇఆర్ఓ లతో కలిసి శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో రాజకీయ పార్టీ ల ప్రతినిధులతో ఎస్ఐఆర్ ప్రక్రియ, నోటీసుల జారీలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముసాయిదా ఓటర్ల జాబితాలో గుర్తించిన అనామలీస్, మ్యాపింగ్ లేని ఓటర్ల వివరాలు, క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కార ప్రక్రియపై రాజకీయ పార్టీ ల ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 17న ఎస్ఐఆర్ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసినట్లు, మ్యాపింగ్ లేని, అనామలీస్ ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 10,85,927 మంది ఓటర్లతో ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలైందని, ఇందులో 1,75,858 మంది మ్యాపింగ్ కాని, అనామలీస్ ఓటర్లకు నోటీసులు జారీచేయనుండగా, ఇప్పటివరకు 1,75,841 నోటీసులు జనరేట్ చేసి, 1,32,817 మందికి నోటీసులు అందజేశామన్నారు. నోటీసుల ప్రకారం 14,680 మంది ఓటర్ల హియరింగ్ ప్రక్రియ పూర్తిచేశామన్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తమ పుట్టి న తేదీ ఆధారంగా భారత ఎన్నికల సంఘం సూచించిన పత్రాల్లో సంబంధిత పత్రాలను సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. పేర్ల అసంబద్ధత వున్న వారు ధృవీకరణలు సమర్పించకున్న, సంబంధిత బూత్ లెవల్ అధికారులు పంచనామా చేసి ధృవీకరిస్తారన్నారు. ప్రస్తుతం కూడా అర్హులైన వారు కొత్త ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందని జిల్లా కలెక్ట ర్ తెలిపారు. 2026 అక్టోబరు 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు, ఏ శాసనసభ నియోజక వర్గంలోనూ ఓటరుగా నమోదు కాకపోతే ఫారమ్-6 ద్వారా తాజా ఫొటో, వయస్సు ధృవీకరణ పత్రం, డిక్లరేషన్ తదితరాలను జతచేసి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 19, 2026న ప్రచురించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ పరిధిలోని ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా తుది జాబితాలో నమోదు అయ్యేలా సహకరించాలని సూచించారు. ఎస్ఐఆర్‌కు సంబంధించిన వివరాల కోసం బూత్ స్థాయి అధికారి, సహాయ ఎన్నికల నమోదు అధికారి, ఎన్నికల నమోదు అధికారులను సంప్రదించవచ్చని, అలాగే టోల్‌ఫ్రీ 1950కు ఫోన్ చేయవచ్చని కలెక్ట ర్ తెలిపారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎస్డిసి సదానందం, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, డిటి అన్సారీ, బీ.ఆర్.ఎస్. పార్టీ ప్రతినిధి ఎం.రమేష్, బీజేపీ ప్రతినిధి వి.రాజేష్, సిపిఐ(ఎం) ప్రతినిధి డి.తిరుపతి రావు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఏ.గోపాల రావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.